



www.epapersamayam.com

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 | సంచిక : 185 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 14 మార్చి 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5


## ఇది వేర్పాటువాద
# మనస్తత్వాన్ని చాటుతోంది



- డీఎంకేపై విమర్శలు గుప్పించిన నిర్మల

**సమయం న్యూస్, ఢిల్లీ:** తమిళనాడు బడ్జెట్ పత్రాల్లో రూపాయి గుర్తును (Rs) తొల గించి.. రూ.అనే అర్థం వచ్చే అక్షరాన్ని చేర్చిన వ్యవహారంపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. ఒకవేళ ఆ గుర్తుతో ఇబ్బంది ఉంటే.. 2010లో దాన్ని కేంద్రం అధికారికంగా ఆమోదించిన సమయంలో ఎందుకు వ్యతిరేకించ లేదని డీఎంకేను 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వంలో డీఎంకే భాగస్వామ్యపక్షంగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. '₹' సింబల్‌ను రూపొందించిన వ్యక్తి డీఎంకే మాజీ ఎమ్మెల్యే తనయుడే కావడం గమనార్హమన్నారు. "రూపాయి చిహ్నం '₹' అంతర్జాతీయంగా బాగా గుర్తింపు పొందింది. యూపీఐ సేవలను అంతర్జాతీయం చేసేందుకు భారత్

తరువాయి 2లో



## రేషన్‌కార్డులు
## ఇక బీపీఎల్, ఏపీఎల్

- ఏప్రిల్‌లో కొత్త కార్డుల జారీ!
- ఎస్ఎల్‌బీసీ ప్రమాదకర ప్రాంతంలో రోబోల వాడకం
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**సమయం న్యూస్, హైదరాబాద్:** రేషన్ కార్డులు ఇక రెండు రకాలుగా ఉంటాయని పౌరసరఫరాలు, నీటి పారుదలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచనప్రాయంగా తెలిపారు. దారిద్ర్యరేఖకు

తరువాయి 2లో

## నేడు గ్రూప్-3 ఫలితాలు

**హైదరాబాద్:** రాష్ట్రంలో 1,365 గ్రూప్-3 సర్వీసుల పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్షల ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. ఇప్పటికే షెడ్యూలు ప్రకారం ఈ నెల 10, 11

తరువాయి 2లో






## ప్రతి నియోజకవర్గంలో
# 10వేల ఇళ్లపై 'సౌర'భాలు

- ప్యానళ్లు పెట్టించే బాధ్యత ఆయా ఎమ్మెల్యేలదే
- ఎస్సీ, ఎస్టీలకు ఉచితం.. బీసీలకు రూ.80వేల వరకూ రాయితీ
- వ్యవసాయ మోటార్లకూ సౌర విద్యుత్తు
- శాసనసభలో సీఎం చంద్రబాబు

**సమయం న్యూస్, అమరావతి :** రాష్ట్రంలో ఒక్కో నియోజక వర్గంలో 10వేల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానల్స్ పెట్టించే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఎమ్మెల్యేలు తమతమ నియోజక వర్గాల్లో అగ్రిగేటర్ల ద్వారా అందరికీ అవగాహన కల్పించాలని, ఇళ్ల యజమానుల నుంచి సమ్మతి లేఖలు తీసుకోవాలని కోరారు. యజమానులు అనుమతి లేఖలు ఇస్తే కాంట్రాక్టు సంస్థలు వచ్చి ప్యానళ్లు బిగిస్తాయని సూచించారు. ఈ ఏడాది 20 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇవన్నీ పూర్తయితే 4వేల మెగావాట్ల విద్యుత్తు వస్తుందని వెల్లడించారు. శాసనసభలో గురువారం విద్యుత్తు రంగంపై నిర్వహించిన స్వల్పకాలిక చర్చకు ఆయన సమాధానమిస్తూ "పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ప్రతి ఇంట్లో విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చు. రాష్ట్రంలో 25 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇంటిపై రెండు కిలోవాట్ల సౌరవిద్యుత్తు ప్యానళ్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. దీంతో 240 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దీనికి రూ.1.15 లక్షల కోట్లు ఖర్చవుతుంది. కేంద్రం రూ.65వేల కోట్లు ఇస్తుండగా.. ఏపీ ప్రభుత్వం రూ.55వేల కోట్లు భరిస్తుంది. ఇంటికి


తరువాయి 2లో

## భారత్ సమ్మిట్‌కు..
# అనుమతులివ్వండి!

- కేంద్ర మంత్రి జైశంకర్‌కు సీఎం వినతి

**సమయం న్యూస్, ఢిల్లీ:** హైదరాబాద్ వేదికగా ఏప్రిల్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించబోతున్న భారత్ సమ్మిట్‌కు కేంద్రం నుంచి అనుమతులు ఇప్పించాలని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఆయన గురువారం ఢిల్లీలో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్‌ఖుర్షీద్, ఎంపీలు మల్లురవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్‌లతో జైశంకర్‌ను కలిశారు. ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా హాజరయ్యే అవకాశం ఉన్నందున దౌత్య, లాజిస్టిక్‌పరమైన సాయంతో దీని విజయవంతానికి సహకారం అందించాలని కోరారు. ఈ సమ్మిట్ ఆధారంగా రానున్న 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం దార్శనికపత్రం తయారు చేయబోతున్నట్లు జైశంకర్‌కు తెలిపారు. అలాగే ఈ ఏడాది హైదరాబాద్‌లో జరగనున్న మిస్‌వరల్డ్ పోటీలు, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, ఇండియా జాయ్ (యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్, వినోద పరిశ్రమ) ఫెస్ట్ వివరాలను ఆయనకు రేవంత్ వివరించారు. ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల నిర్వహణకు సహకారం అందించడం ద్వారా తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి

తరువాయి 2లో



## దక్షిణాది హక్కుల కోసం
## కిషన్‌రెడ్డి పోరాడాలి

- కేంద్ర క్యాబినెట్‌లో ప్రస్తావించాలి
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఉత్తరాదికంటే కేంద్రానికి ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నామని వెల్లడి
- మెట్రో, మూసీ, ఆర్ఆర్ఆర్ లాంటి ప్రాజెక్టులకే నిధులడుగుతున్నామని స్పష్టం

2లో





## మహిళా సారథ్యంలో
# భారత్ అభివృద్ధి..


: ఐరాస సదస్సులో కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి

ఐక్యరాజ్యసమితి: భారత అభివృద్ధికి మహిళలే నేతృత్వం వహిస్తున్నారని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ఆలోచన నుంచి అమలు, పర్యవేక్షణ వరకూ అన్ని స్థాయిల్లో మహిళల క్రియాశీల భాగస్వామ్యం ఉంటోందని చెప్పారు. బుధవారం 'ఐరాస కమిషన్ ఆన్ ద స్టేటస్

తరువాయి 2లో

## ఫ్రీహోల్డ్ పేరిట
# పేదల భూముల్ని కొట్టేశారు

: వైకాపా ప్రభుత్వంలో అక్రమాల పర్వం
- కబ్జాలను అణచివేసేలా కొత్త చట్టం
- శాసనసభలో హోంశాఖ మంత్రి అనిత



**సమయం న్యూస్, అమరావతి :** 'రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను జగన్ అస్తవ్యస్తం చేశారు. ఎన్నడూ గ్రామసభలు నిర్వహించలేదు. బడుగు బలహీన వర్గాలకు మేలు చేస్తామని, ఎసైన్డ్ భూముల్ని 22ఎ నుంచి తొలగించి ఫ్రీహోల్డ్ చేస్తామని నమ్మబలికారు. ప్రభుత్వ, ఎసైన్డ్ భూముల్ని ఫ్రీ హోల్డ్ చేసి వైకాపా నేతల పేర్లతో రాయించుకున్నారు. ఫ్రీహోల్డ్‌కు ముందే అమాయకులైన ఎసైన్డ్ భూముల యజమానులకు ఆశ చూపించి కారుచౌకగా కొట్టేశారు'

తరువాయి 2లో

# దక్షిణాది హక్కుల కోసం కిషన్‌రెడ్డి పోరాడాలి



సమయం న్యూస్, దిల్లీ: కేంద్రం చేయబోయేది నియోజకవర్గాల మదింపు కాదు... దక్షిణాది రాష్ట్రాల రాజకీయ శక్తి కుదింపు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. డీలిమిటేషన్ దక్షిణాది ప్రజల ప్రాథమిక హక్కులను ప్రభావితం చేస్తున్నందున దాని గురించి కేంద్ర క్యాబినెట్‌లో ప్రస్తావించాల్సిన బాధ్యత రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై ఉందని అన్నారు. దక్షిణాది నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన ప్రజల హక్కులకోసం పోరాడాలని సూచించారు. దిల్లీలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి విలేక ర్లతో మాట్లాడారు. ''దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత తెలంగాణ భాజపా నేతలపై కూడా ఉంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసే అఖిలపక్ష సమావేశానికి తెలంగాణ భాజపా అధ్యక్షుడి హోదాలో కిషన్‌రెడ్డిని ఆహ్వానించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చెప్పా'' అని తెలిపారు. ''ఉత్తరాదికంటే కేంద్రానికి ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నాం. జాతికి పెద్ద ఎత్తున సేవలందిస్తున్నాం. దక్షిణాది ప్రజలు భాజపా ఎదగడానికి అవకాశం కల్పించడంలేదన్న దుర్బుద్ధితో ఆ పార్టీ వారిపై డీలిమిటేషన్ పేరుతో కక్ష సాధించాలని నిర్ణయించుకొంది. దక్షిణాది అవకాశాలను పరిమితం చేసే ఆ చర్యలను మేం అంగీకరించం'' అని స్పష్టం చేశారు.

*** కేంద్ర కుట్రను తిప్పకొట్టడానికి చెన్నైలో కార్యాచరణ**

''భాజపా, కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాదిపై పన్నుతున్న కుట్రను తిప్పికొట్టడానికి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చెన్నైలో ఈ నెల 22న నిర్వహిస్తున్న అఖిలపక్ష సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రిగా నన్ను ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకత్వం అనుమతితో హాజరై దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న నష్టాన్ని చర్చించి మేం కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేస్తాం. అంతకంటే ముందే తెలంగాణలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలనుకుంటున్నాం.

*** దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అందరూ రావాలి**

స్టాలిన్ నిర్వహిస్తున్న సమావేశానికి పార్టీలకు అతీతంగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అందరూ రావాలి. ఇది ఒక్కరోజు కోసం నిర్వహిస్తున్న సమావేశం కాదు. 2029 ఎన్నికల్లోపు జరగబోయే అన్ని పరిణామాలనూ ఎదుర్కోవడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ఇందులో నిర్ణయిస్తాం. కేంద్ర ప్రభుత్వం, భాజపా చర్యలకు వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందించడమే ఈ సమావేశం ముఖ్య ఎజెండా అన్నది నా ఉద్దేశం'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో మీరేమైనా కీలకపాత్ర పోషిస్తారా అన్న విలేకరుల ప్రశ్నకు బదులిస్తూ... ''ఇప్పటికే స్టాలిన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆయన చర్యలను ప్రోత్సహిస్తూ భవిష్యత్తు కార్యాచరణ చేపట్టడమే మా ప్రధాన ఉద్దేశం'' అని పేర్కొన్నారు.

# ప్రతి నియోజకవర్గంలో 10వేల ఇళ్లపై 'సౌర'భాలు

(మొదటిపేజీ తరువాయి)

వంద యూనిట్లే వాడుకుంటే మిగతాదానికి యూనిట్‌కు రూ.2.09 చొప్పున ప్రభుత్వం ప్రతి నెలా డబ్బులు చెల్లిస్తుంది. ఉచిత విద్యుత్తుతో పాటు ఆదాయం కూడా వస్తుంది. ప్రజలు అర్థం చేసుకొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి. 2030 ఏళ్లు ఉచితంగా విద్యుత్తు వస్తుంది'' అని తెలిపారు.

*** బీసీలకు అదనంగా రూ.20వేల రాయితీ**

- బీసీలకు కేంద్రం ఇచ్చే రాయితీకి అదనంగా రూ.20వేల రాయితీ ఇస్తాం. రెండు కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.1.20 లక్షల వరకు ఖర్చవుతుండగా.. కేంద్రం రూ.60వేలు
- రాయితీగా అందిస్తుంది. బీసీలకు రాష్ట్రప్రభుత్వం తరఫున మరో రూ.20వేలు అదనంగా ఇస్తాం. బీసీలకు అండగా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం.
- ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలోవాట్ల వరకు పూర్తి ఉచితంగా అందిస్తాం.
- ఇతరులకు ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు రూ.78వేలు రాయితీ ఇస్తాం. మిగిలినది ఇంటి యజమాని పెట్టుకోవాలి. దానికి ప్రభుత్వం నుంచి గానీ, బ్యాంకు నుంచి గానీ రుణం తీసుకోవచ్చు. ప్రభుత్వం నుంచి తీసుకుంటే తొమ్మిదేళ్లలో 9.5% వడ్డీతో తిరిగి చెల్లించాలి.

*** రూ.5.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి**

- 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనం కోసం పాలసీ తీసుకొచ్చాం. రూ.10లక్షల కోట్ల పెట్టుబడితో 7.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేలా దీన్ని తీసుకొచ్చాం. ఇప్పటివరకు రూ.5.19లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. పునరుత్పాదక ఇంధనం 47.2 గిగావాట్లు అందుబాటులోకి వస్తుంది. పనులు పూర్తయితే 3.70 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. సౌరవిద్యుత్తు ప్యానల్ తయారీ యూనిట్లు వస్తే మరో 3 లక్షల ఉద్యోగాలు వస్తాయి.
- కూటమి ప్రభుత్వం వచ్చాక సరఫరా నష్టాలను 10.35% నుంచి 9.27%కి తగ్గించాం. దీంతో రూ.1350 కోట్లు ఆదా అయ్యాయి. వచ్చే ఐదేళ్లలో ట్రాన్స్‌మిషన్‌లో రూ.16వేల కోట్లు ఖర్చుచేస్తాం. వర్సిటీల్లో హరిత విద్యుత్తుపై పరిశోధనలు చేయాలి.
- శ్వాపింగ్ విధానం తీసుకొస్తున్నాం. ఈ రోజు 600 మెగావాట్లు వేరే రాష్ట్రాల నుంచి వస్తోంది. ఇతర రాష్ట్రాలకు అవసరాలు ఉన్నప్పుడు మనం ఇస్తాం. మార్కెట్‌లో విద్యుత్తు కొనాలంటే యూనిట్ ధర రూ.5.80 ఉండగా.. మనకు సగటున రూ.4.80కే వస్తోంది.

గతేడాది యూనిట్‌కు రూ.5.16 చొప్పున విద్యుత్తు కొన్నారు. ఏప్రిల్ నుంచి దీన్ని రూ.4.80కి తగ్గించాలని లక్ష్యంగా పెట్టాను. వచ్చే ఐదేళ్లు ఛార్జీలు పెంచబోము.

*** విద్యుత్తు వాడకుండానే రూ.9వేల కోట్లు చెల్లించారు**

''201924 మధ్య చీకటి రోజులు కొనసాగాయి. అసమర్థ పాలన వల్ల ఏం జరుగుతుందో ఇదో కేస్ స్టడీ. సౌర విద్యుత్తును వాడకుండానే రూ.9వేల కోట్లు చెల్లించారు. కృష్ణపట్నం స్టేజ్ 2, వీటీపీఎస్ స్టేజ్ 5 రెండూ ఆలస్యం కావడంతో రూ.18,818 కోట్ల వ్యయం పెరిగిపోయింది. పోలవరం విద్యుత్తు ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో రూ.1,044 కోట్లు నష్టపోయాం. గత ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాలతో బకాయిలు రూ.1.12 లక్షల కోట్లకు పెరిగిపోయాయి. 9సార్లు టారిఫ్ పెంచి, పేదలపై రూ.32,166కోట్ల భారం వేశారు. నెలకు వంద యూనిట్లు వాడేవారికి యూనిట్ ధర రూ.2.44 ఉంటే దాన్ని రూ.4.53కి పెంచారు'' అని సీఎం తెలిపారు.

*** ప్రపంచబ్యాంకు జీతగాడన్నా భరించాను**

''రాష్ట్రం కోసం మంచి చేయాలనుకుంటే ఇదే అసెంబ్లీలో నన్ను ప్రపంచబ్యాంకు జీతగాడని మాట్లాడారు. సీఎంగా ఉన్నా నిందలు పడ్డాను. రాష్ట్రం కోసం తృప్తిగా నిందలు భరించాను. అప్పట్లో దేశంలోనే తొలిసారి విద్యుత్తులో సంస్కరణలు తీసుకొచ్చిన రాష్ట్రం ఏపీ. సరఫరా నష్టాలను 35% నుంచి 23%కి తగ్గించాం. 200304 నాటికి విద్యుత్తు కొరత లేని రాష్ట్రంగా రూపొందించాం. దీంతో రాష్ట్రానికి లాభాలు రాగా.. నాకు నష్టాలు వచ్చాయి. నేను తీసుకొచ్చిన సంస్కరణలను ప్రజలు అర్థం చేసుకోలేకపోవడంతో ఓడిపోయాం. ఉచిత కరెంట్.. విద్యుత్తు బిల్లులు మాఫీ చేయలేకపోయాం. మేము చేసిన సంస్కరణలను ఉపయోగించుకొని మాఫీ చేస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది'' అని పేర్కొన్నారు.

*** రైతులకు పీఎం కుసుమ్**

పీఎం కుసుమ్ కింద 3.85 లక్షల పంపుసెట్లకు సౌరవిద్యుత్తు పెట్టాలని అనుకుంటున్నాం. దీనికి కేంద్రం ఆమోదం తెలిపింది. రైతులు 7.5 హెచ్‌పీ మోటార్లకు సౌరవిద్యుత్తు పెట్టుకుంటే ఒక్క పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. అవసరాలకు వాడుకున్న తర్వాత మిగతా విద్యుత్తును గ్రిడ్‌కు ఇవ్వొచ్చు. కొంతమంది రైతులు ముందుకు రాకపోతే..విద్యుత్తు ఉపకేంద్రాల వద్ద 1,327 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తాం.

# నకిలీ సిమ్ కార్డులపై అస్త్ర

*** 10 సెకన్లలో కోటి ముఖాలను వడబోసే సామర్థ్యం**

*** తొలి దశలో 87 కోట్ల మొబైల్ కనెక్షన్ల విశ్లేషణ**

*** సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరస్థుల ఆటకట్టు**

హైదరాబాద్: 'వంద పేర్లు.. 100 నకిలీ ధ్రువపత్రాలు.. 213 సిమ్‌కార్డులు' ఒకే వ్యక్తి సైబర్ మోసాల కోసం చేసిన నేరమిది. అతడి స్వరూపాన్ని 'అస్త్ర' సాంకేతిక పరిజ్ఞానం అవలీలగా కనిపెట్టింది. నకిలీ సిమ్‌కార్డులతో సైబర్ నేరాలకు తెగబడుతున్న మోసగాళ్ల పాలిట ఇది సరికొత్త అస్త్రంలా మారింది. కృత్రిమ మేధ ఆధారంగా మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్ పరిధిలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ రూపొందించిన ఈ సాంకేతికత నేరస్థుల ఆటకట్టిస్తోంది. 'ఏఐ అండ్ ఫేషియల్ రికగ్నిషన్ పవర్డ్ సొల్యూషన్ ఫర్ టెలికం సిమ్ సబ్‌స్క్రైబర్ వెరిఫికేషన్(అస్త్ర)' అని పిలిచే ఈ సాంకేతికత మోసగాళ్ల గుట్టు రట్టు చేస్తోంది. కోట్ల మంది వినియోగదారుల డేటాబేస్‌ను సమర్థంగా వడబోసి నకిలీలను పట్టేస్తోంది. ఇలా మనరాష్ట్రంలో నిరుడు 14,885 సిమ్‌కార్డులను బ్లాక్ చేసింది. సైబర్ నేరగాళ్లు నకిలీ ధ్రువపత్రాలతో సిమ్‌కార్డులను పొందుతూ బ్యాంకుల్లో ఖాతాలు తెరుస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ ఖాతాలను ప్రారంభిస్తున్నారు. వాయిస్‌కాల్స్ చేయడం, సంక్షిప్త సందేశాలు, మెయిల్స్ పంపడం ద్వారా ప్రజల ఓటీపీలాంటి కీలక సమాచారాన్ని తెలుసుకొని డబ్బు కొట్టేస్తున్నారు. అలా కాజేసిన సొమ్మును ఖాతాల్లోకి బదిలీ చేయించుకొని ఏటీఎంల నుంచి డ్రా చేసేస్తున్నారు.

*** మోసాల గొలుసును తెంపేందుకు...**

మోసగాళ్లు సిమ్‌కార్డులను తీసుకునేటప్పుడు నకిలీ ధ్రువపత్రాలను సమర్పించినా... ఫేషియల్ రికగ్నిషన్ తప్పనిసరి. ఈక్రమంలో వారు ఎన్ని సిమ్‌లు తీసుకున్నా 'అస్త్ర' వడబోతలో ఇట్టే తెలిసిపోతో)వెంటనే బ్లాక్ చేస్తున్నారు. దాని ఉపయోగించి నకిలీ ఖాతాలను తెరవకుండా అడ్డుకుని సైబర్ మోసాల గొలుసుకట్టును తెంపగలుగుతున్నారు. నకిలీల సమాచారాన్ని దర్యాప్తు సంస్థలకు చేరవేసి, వారిని పట్టుకునే ప్రయత్నమూ చేస్తున్నారు.

*** కనీసం 97.5% సరిపోలితేనే ఫలితం**

టెలికమ్యూనికేషన్ శాఖ దేశంలోని సిమ్ వినియోగదారులందరి డేటాను 2012 నుంచి చిత్రాలతో సహా టెలికం ఆపరేటర్ల నుంచి సేకరిస్తోంది. ఆ సమాచారంతో రూపొందించిన డేటాబేస్... అస్త్రకు కోర్ డేటాబేస్‌గా



మారింది. ఎప్పటికప్పుడు దాన్ని అప్‌డేట్ చేస్తున్నారు. 2021 ఏప్రిల్‌జులై మధ్య కాలంలో హరియాణాలోని మేవాట్ రీజియన్‌లో అస్త్రను ప్రయోగాత్మకంగా పరిశీలించారు. అనుమానితుడి చిత్రాన్ని ఇస్తే 10 సెకన్లలోనే కోటి చిత్రాలతో సరిపోల్చింది. రెండు చిత్రాల్లోని ముఖాల మధ్య సారూప్యత కనీసం 97.5% వరకు సరిపోలితేనే ఒకే వ్యక్తిగా అస్త్ర పరిగణిస్తుంది. తొలిదశలో అస్త్ర సుమారు 87 కోట్ల మొబైల్ కనెక్షన్లను విశ్లేషించింది.వాటిల్లో 40 లక్షల మందికిపైగా వినియోగదారులు ఒకే చిత్రాన్ని వినియోగించి బహుళ కనెక్షన్లు పొందినట్లు తేల్చింది. పరిశీలన అనంతరం 36 లక్షల కనెక్షన్లను టెలికం ఆపరేటర్లు డిస్‌కనెక్ట్ చేశారు. వారి సమాచారాన్ని బ్యాంకులకు, పేమెంట్ వ్యాలెట్లకు, సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫాంలకూ పంపించారు.

**ఇది ఎలా పనిచేస్తుందంటే...**

డేటా కలెక్షన్: టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి 100% సిమ్‌కార్డు కొనుగోలుదారుల డేటాను సేకరిస్తోంది. సిమ్ రిజిస్ట్రేషన్ సమయంలో కొనుగోలుదారుడు సమర్పించిన చిత్రాన్ని సైతం సమీకరిస్తోంది. ఇమేజ్ మ్యాచింగ్: కొనుగోలుదారుడి ముఖ కవళికల్ని తమ డేటాబేస్‌లోని ఇతర చిత్రాలతో సరిపోల్చడం ద్వారా అదే వ్యక్తి పేరిట ఇంకా ఏమైనా సిమ్ కనెక్షన్లు ఉన్నాయేమోనని తేల్చేస్తోంది. ఫ్రాడ్ డిటెక్షన్: ఒకే వ్యక్తి పేరిట బహుళ కనెక్షన్లు ఉంటే గుర్తిస్తోంది. ఆయా కనెక్షన్లు అతడి వాస్తవ ధ్రువపత్రాలతోనే ఉన్నాయో లేదో సరిచూస్తోంది. ఒకవేళ లేకుంటే అనుమానితుల జాబితాలో చేర్చుతోంది. యాక్షన్: అనుమానితుల జాబితాను సంబంధిత దర్యాప్తు సంస్థలకు, టెలికం ఆపరేటర్లకు పంపిస్తోంది.నేరస్థులను గుర్తించి సైబర్ నేరాలను ముందస్తుగానే నియంత్రిస్తోంది.

## భారత్ సమ్మిట్‌కు అనుమతులివ్వండి!

(మొదటిపేజీ తరువాయి)

జైశంకర్ సానుకూలంగా స్పందించారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో చేపట్టే కార్యక్రమాలకు తమ మంత్రిత్వశాఖ మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అంతకుముందు ముఖ్యమంత్రి విలేకర్లతో మాట్లాడుతూ... ''మేలో హైదరాబాద్‌లో జరిగే మిస్‌వరల్డ్ పోటీలకు 100కుపైగా దేశాల నుంచి పోటీదారులు, విదేశీ ప్రతినిధులు, 3,000 మందికిపైగా మీడియా ప్రతినిధులు హాజరుకాబోతున్నారు. ఈ పోటీకి సంబంధించిన కార్యక్రమాలు రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాల్లో జరుగుతాయి. ఇందుకనువైన చారిత్రక, పర్యాటక స్థలాలను ఎంపిక చేయడానికి త్వరలో అధికారులతో కమిటీ ఏర్పాటు చేయబోతున్నాం. ఇప్పటికే గుర్తింపు పొందిన స్థలాలను, కొత్త ప్రదేశాలను ఎంపికచేయడం పరంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై తగిన సిఫార్సులు చేస్తుంది''అని పేర్కొన్నారు.

## రేషన్‌కార్డులు ఇక బీపీఎల్, ఏపీఎల్

(మొదటిపేజీ తరువాయి)

దిగువన ఉన్నవారికి బీపీఎల్ కార్డులు.. ఎగువన ఉన్నవారికి ఏపీఎల్ కార్డులు ఇచ్చే ఆలోచన ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పుడు ట్రైకలర్‌లో బీపీఎల్ కార్డులను, గ్రీన్ కలర్‌లో ఏపీఎల్ కార్డులను పంపిణీ చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గురువారమిక్కడ అసెంబ్లీలో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''రాష్ట్రంలో 2.8 కోట్ల మంది రేషన్‌కార్డుల లబ్ధిదారులుగా ఇప్పటికే ఉన్నారు. అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇస్తుంది. కార్డుల తయారీ సంస్థ ఎంపిక కోసం టెండర్లు పిలిచాం. ఆ ప్రక్రియ నెలాఖరులోగా అయిపోతుంది. కొత్త రేషన్‌కార్డుల జారీ ఏప్రిల్‌లో ఉండొచ్చు. కొత్తవారితో పాటు ఇప్పటికే కార్డులున్న వారికి స్మార్ట్‌కార్డులు జారీచేస్తున్నాం. గతంలో పింక్‌కార్డులు ఉన్నవారికి గ్రీన్‌కార్డులు, తెల్లకార్డు ఉన్నవారికి ట్రైకలర్ కార్డులు వస్తాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం భారాస ప్రభుత్వం ఖర్చుచేసిన రూ.లక్ష కోట్లు రాష్ట్రానికి నష్టం వాటిల్లింది. మూడు బ్యారేజీల వాడకం విషయంలో గత ప్రభుత్వంలా వ్యవహరిస్తే 44 గ్రామాలు, భద్రాచలం పట్టణం కొట్టుకుపోతాయి'' అని మంత్రి పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చివరి 50 మీటర్లు ప్రమాదకరమని ఉత్తమ్ అన్నారు. అందుకే అక్కడ రోబోలను వాడుతున్నామని, దీనికి రాతపూర్వక అనుమతి ఇచ్చామని చెప్పారు. ప్రమాదం జరగకపోతే సొరంగం పనులు రెండేళ్లలో పూర్తయ్యేవన్నారు. తాను ఇప్పటికే ఏడుసార్లు గెలిచానని, మంత్రిగా ఉన్నానని, మరే ఆశలు లేవంటూ విలేకరులడిన ప్రశ్నకు ఉత్తమ్ బదులిచ్చారు. భాజపా ఎమ్మెల్యే రామారావు పటేల్ స్పందిస్తూ.. మీరు ముఖ్యమంత్రి కావాలిగా అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

## నేడు గ్రూప్3 ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

తేదీల్లో గ్రూప్1, గ్రూప్2 రాతపరీక్షల మార్కులను కమిషన్ వెల్లడించింది. 14న గ్రూప్3 జనరల్ ర్యాంకు జాబితా వెల్లడికానుంది. ఈ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 5.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా..నవంబరు 17, 18 తేదీల్లో రాతపరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 50.24శాతం మంది అభ్యర్థుల హాజరు నమోదైంది.

## ఇది వేర్పాటువాద మనస్తత్వాన్ని చాటుతోంది

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నాలు చేస్తోంది. ఇటువంటి సమయంలో.. సొంత కరెన్సీ చిహ్నాన్ని మనం బలహీనపరుస్తున్నామా?'' అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను నిలబెడతామని రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేస్తారని.. అయితే, '₹' వంటి జాతీయ చిహ్నాన్ని తొలగించడం ఆ ప్రమాణానికే విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఇది జాతీయ ఐక్యత పట్ల నిబద్ధతను దెబ్బతీస్తుందన్నారు. డీఎంకే చర్యలు.. దేశ ఐక్యతను బలహీనపరిచే వేర్పాటువాద భావాలను ప్రోత్సహించే ప్రమాదకరమైన మనస్తత్వాన్ని సూచిస్తోందని మండిపడ్డారు.

## మహిళా సారథ్యంలో భారత్ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

ఆఫ్ వుమెన్' 69వ సదస్సులో ఆమె ప్రసంగించారు. మహిళాభివృద్ధిపై మంత్రిత్వ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. భారత ప్రభుత్వం స్థాపించిన సార్వజనిక డిజిటల్ మౌలిక సదుపాయాలు.. లైంగిక వివక్షను నిర్మూలించి మహిళల్ని ఆర్థికాభివృద్ధిలో భాగస్వాముల్ని చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ రంగంలో తమ అనుభవాలను ప్రపంచ దేశాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎనభై వసంతాలు పూర్తిచేసుకున్న ఐరాస సామర్థ్య పెంపుదలకు సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ కొత్త చర్యలను ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యయ నియంత్రణ తప్పనిసరి అని అన్నారు. సామర్థ్య పెంపుదలకు తీసుకోదగిన చర్యల కోసం అండర్ సెక్రటరీ జనరల్ గయ్ రైడర్ నేతృత్వంలో ఒక అంతర్గత కార్యదళాన్ని నియమించారు.

## ఫ్రీహోల్డ్ పేరిట పేదల భూముల్ని కొట్టేశారు

(మొదటిపేజీ తరువాయి)


అని హోంశాఖ మంత్రి అనిత ధ్వజమెత్తారు. శాసనసభలో గురువారం రెవెన్యూ పద్దులపై చర్చ అనంతరం మంత్రి సత్యప్రసాద్ తరఫున అనిత సమాధానమిచ్చారు. 'కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్రీహోల్డ్ భూములను రీవెరిఫికేషన్ చేయించాం. 13 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్ చేయగా.. 5 లక్షల ఎకరాలకు సంబంధించి నిబంధనలు పాటించలేదు. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లలోనూ అవకతవకలే. 25 వేల ఎకరాల రిజిస్ట్రేషన్‌లలో 8 వేల ఎకరాలను చట్టవిరుద్ధంగా చేశారు. అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని ప్రైవేటు భూముల్ని కబ్జా చేశారు' అని వెల్లడించారు. 'ప్రభుత్వం మారాక బాధితులంతా బయటకొచ్చారు. రెవెన్యూ, పోలీస్‌శాఖలకు వచ్చే అర్జీల్లో 70% భూసంబంధమైనవే ఉంటున్నాయి. ఆక్రమణలను అణచివేసేందుకు కబ్జారాయుళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నాం' అని మంత్రి వివరించారు.

**తప్పులతడకగా రీసర్వే....**

'వైకాపా ప్రభుత్వం రీసర్వేనూ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటూ.. తప్పుల తడకగా మార్చింది. 6,688 గ్రామాల్లో రీసర్వే చేస్తే.. విస్తీర్ణం, సరిహద్దులు, వర్గీకరణ, పేర్లలో అన్నీ తప్పులే. వాటి పరిష్కారానికి గ్రామాల్లో కూటమి ప్రభుత్వం సభలు నిర్వహించింది. 2.79 లక్షల అర్జీలు రావడమే తప్పుల తడకగా సర్వే సాగిందని చెప్పేందుకు నిదర్శనం.. అందులో 98% పరిష్కరించాం. నెలాఖరులోగా 2% పరిష్కరిస్తాం. రెవెన్యూ సదస్సుల సందర్భంగా 1.85 లక్షల అర్జీలు రాగా.. 93% పరిష్కరించాం' అని తెలిపారు.

**రోజుకు 20 ఎకరాలే సర్వే**

'జనవరి 20న రాష్ట్రవ్యాప్తంగా 628 గ్రామాల్లో శాస్త్రీయంగా రీసర్వే ప్రారంభించాం. ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని పైలట్‌గా తీసుకుని రీసర్వే ప్రారంభించాం. ఒక్కో బ్లాక్‌లో ఇద్దరు సర్వేయర్లు, ఒక వీఆర్‌ఓ, వీఆర్‌ఏను నియమించాం. వీరు 200 నుంచి 250 ఎకరాల్లో సర్వే చేస్తారు. బ్లాక్‌లోని రైతులతో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి, సమాచారం పంపిస్తాం. స్థానికంగా నివాసం ఉండని భూయజమానులు సర్వే సమయంలో తమ ప్రతినిధిని పంపవచ్చు. రోజుకు 20 ఎకరాలే సర్వే చేస్తాం' అని మంత్రి అనిత వివరించారు.



# తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసిన మొల్ల

* **రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**సమయం న్యూస్, అమరావతి :** తెలుగు సాహిత్యంలో కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల) చెరగని ముద్ర వేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. తెలుగు సాహిత్యంలో ఆమె రచనలకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. గురువారం మొల్ల జయంతి సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ఆమె చిత్రపటానికి మంత్రి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, సామాన్య కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్ల మాంబ శ్రీరాముడిని అచంచలమైన భక్తి ప్రపత్తులతో కొలిచారన్నారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించించిన మహా నీయురాలు మొల్ల అని కొనియాడారు. తెలుగు వాడుక భాషలోకి ఆమె రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతగాంచిందన్నారు. మొల్ల తన రచనలలో నైతిక విలువలకు ప్రాధాన్య మిచ్చేవారన్నారు. తెనాలి రామ లింగడ వంటి దిగ్గజ కవులకు మొల్ల సమకాలీన రాలు అని చరిత్ర చెబుతోంది. కడపలోని గోపవరం గ్రామంలో జన్మించిన మొల్ల నేటి తరం మహిళాలకు, కవయిత్రిలకు ఆదర్శమని కొనియాడారు. ఆమె రచనలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారులు, ప్రజాప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు


: **మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



**హైదరాబాద్, మార్చి 13 సమయం న్యూస్:** రంగుల పండుగ హోలీ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, "హోలీ మన సమాజంలో ఐక్యతను, ప్రేమను, స్నేహాన్ని ప్రతిబింబించే పండుగని అన్నారు. హోలీ రంగుల పండుగని, ఈ పండుగ అందరికీ సంతోషాన్ని, ఆరోగ్యాన్ని, శాంతిని కలిగించాలని ఆకాంక్షించారు. నగర ప్రజలు హోలీ వేడుకలను జాగ్రత్తగా, సంతోషంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## హోలీ పండుగ శుభాకాంక్షలు

**: కమిషనర్ ఇలంబర్తి**



హైదరాబాద్, మార్చి 13: హోలీ పండుగను పురస్కరించుకొని నగర ప్రజలకు జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ భారతీయ సంస్కృతిలో ఎంతో ప్రత్యేకమైనదని, ఇది రంగుల పండుగగా ప్రసిద్ధి చెందిందని, హోలీ పండుగ ప్రజల మధ్య ఆనందాన్ని, ఐక్యతను, ప్రేమను చాటిచెప్పే ఉత్స వంగా జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు.హోలీ పండుగ ఆనందం, ఉల్లాసం, సామరస్యానికి సంకేతంగా, కొత్త శుభారంభానికి సూచికగా జరుపుకుంటారని అన్నారు. ప్రజలు సురక్షితంగా, ఆనందంగా హోలీ వేడుకలను జరుపుకోవాలని, పర్యావర ణానికి హాని చేయని రంగులను ఉప యోగించాలని సూచించారు.

## హోలీ శుభాకాంక్షలు

* **డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి**



హైదరాబాద్, మార్చి 13: హోలీ పండుగను పురస్కరించుకుని నగర ప్రజలకు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "హోలీ పండుగ అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిలోకి తెచ్చే మతసామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, స్నేహపూర్వకంగా హోలీ పండుగ సంబరాలు జరుపుకోవాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ హోలీ వేడుకలను నిర్వహించాలని, హానికరమైన రంగుల నుండి దూరంగా ఉండాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు.




# చరిత్రలో నిలిచేలా 'జనసేన' ఆవిర్భావ సభ ఏర్పాట్లు

* **14న జరిగే సభకు అంతా సమాయత్తం**
* **పండుగ వాతావరణంలో పిఠాపురం**
* **జనసైనికుల్లో ఫుల్ జోష్..**





అమరావతి: అందరి చూపు పిఠాపురం వైపే కనిపిస్తుంది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ ఆవిర్భవించి ఈ నెల 14కు 11 ఏళ్లు పూర్తి కానుంది. ఈ క్రమంలో పవన్ ను ఎమ్మెల్యేగా గెలిపించిన పిఠాపురం ప్రజల సమక్షంలో ఈ నెల 14న జనసేన ఆవిర్భావ వేడుకలు జరగనున్న సంగతి తెలిసిందే. పార్టీ అధికారంలోకి వచ్చాక మొట్టమొదటి కార్యక్రమం కావడంతో జనసేన ఆవిర్భావ వేడుకలు అంగరంగ వైభవంగా జరిపేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఆమేరకు ఆవిర్భావ సభ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందు కోసం పిఠాపురం పరిధిలోని చిత్రాడ ఆవిర్భావ వేడకలకు వేదికగా నిలిచింది.

* **పవన్ కళ్యాణ్ ఆదేశాలతో..:**

జనసేన ఆవిర్భావ వేడుకలకు సంబంధించి పార్టీలోని దాదాపుగా ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తూ సాగుతున్న తీరు ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇప్పటికే పార్టీ ఆవిర్భావ సభ నిర్వహణకు సంబంధించిన పలు కమిటీలను పవన్ కల్యాణ్ ప్రకటించారు.అందుబాటులోకి వస్తున్న మరింత మంది నేతలను ఆయా కమిటీల్లోకి జత చేస్తూ సాగుతున్నారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ సారథ్యంలో ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ అయితే ఈ ఏర్పట్లలో నిండా మునిగిపోయారు. సభ ఏర్పాట్లకు సంబంధించి జరుగుతున్న ప్రతి చిన్న పనిని కూడా ఆయన దగ్గరుండి మరీ చూసుకుంటున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, కింది స్థాయి కార్యకర్తలు అంతా ఈ ఏర్పాట్లలోనూ మునిగిపోయారు. ఫలితంగా పిఠాపురంలో పండుగ వాతావరణం నెలకొంది.

* **ఊరూరా జనసైనికుల జోష్**

జనసేన ఆవిర్భావ సభ నేపథ్యంలో ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాలలో జనసేన ఫ్లెక్సీలు, జెండాలు వారం ముందు నుంచే రెపరెపలాడుతున్నాయి. పార్టీ అధినేతలు, ద్వితీయ శ్రేణినేతలు, జనసైనికులతో చిత్రాడ ప్రాంగణం సందడిగా మారింది. సాధారణ కార్యకర్తల నుంచి సీనియర్ నేతల వరకూ అందరిలో ఆవిర్భావ సభ జోష్ కనిపిస్తోంది.

* **కాకినాడలో కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ:**

తాజాగా శనివారం జన సేన ఆవిర్భావ వేడుకలకు సంబం ధించిన ఏర్పాట్లను నిత్యం పర్యవేక్షించేందుకు ఏకంగా కంట్రోల్ రూం అందుబాటులోకి వచ్చింది. పిఠాపురంలో ఈ కంట్రోల్ రూంను నాదెండ్లతో కలిసి ఉదయ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ ఏర్పాట్ల తీరు చూస్తుంటే.. నిజంగానే జనసేన ఆవిర్భావ వేడకలు ఏ రేంజిలో జరుగుతాయన్న అంశం అసలు ఊహకే అందట్లేదు. ఎన్నికల్లో జనసేన 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడం, పవన్ చట్టసభల్లోకి అడుగుపెట్టడతోనే డిప్యూటీ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తీరుతో పార్టీ శ్రేణులు ఉరిమే ఉత్సాహంతో ఉన్నారు. ఫలితంగా ఈ సభకు 10 లక్షలకు మించిన జనం హాజరైనా ఆశ్చర్యపోవాల్సిన పని లేదన్న వాదన వినిపిస్తోంది.

* **ఇంటింటికి ఆహ్వానం:**

పిఠాపురం వేదికగా జనసేన పార్టీ ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు కసరత్తు చేస్తున్నాయి. 12వ ఆవిర్భావ సభకు మహిళలను ఆహ్వానించేందుకు ఆ పార్టీ నేతలు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆడపడుచులను ఆహ్వానించేలా ప్రత్యేకంగా రూపొందించిన బొట్టు స్టిక్కర్లతో కూడిన ఆహ్వాన పత్రికను పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ కాకినాడ కంట్రోల్ రూమ్లో ఆవిష్కరించారు. పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తరపున ఆడపడుచులను ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి సభకు ఆహ్వానించేలా పార్టీ వీరమహిళ విభాగానికి చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా పార్టీ అధిష్టానం దిశానిర్దేశం చేసింది.

# LRS దరఖాస్తులకు వేగవంతమైన పరిష్కారం

* **ఇంటి పన్ను వసూలుపై కలెక్టర్ ఆదేశాలు.**



**సంగారెడ్డి మార్చి13 (సమయం న్యూస్) :** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బుధవారం మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, స్కీమ్ లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (LRS) దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్ల రెగ్యులరైజేషన్ కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో, వాటిని త్వరగా పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఫోన్ కాల్ చేసి రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలియజేయాలనీ అన్నారు. ఈ నెల 31లోపు పూర్తి ఫీజు చెల్లించిన వారికి 25% రిబేట్ వర్తిస్తుందని స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, టాంటాం ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ప్రయోజనం కలిగేలా వేగంగా సమస్యలు పరిష్కరించి, రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి. ఇంటి పన్ను (హౌస్ టాక్స్) & ప్రాపర్టీ టాక్స్ 100% వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయ వనరులను మెరుగుపరిచేందుకు పన్నుల వసూలు అత్యంత కీలకమని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి, పన్నుల వసూళ్లు పూర్తిగా చేయాలని సూచించారు. ఇంటి పన్ను (హౌస్ టాక్స్) & ప్రాపర్టీ టాక్స్ వసూలు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పట్టణం, గ్రామంలో 100% పన్ను వసూలు చేయాలనే లక్ష్యంగా పన్ను వసూలు చేయాలనీ తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీరాజ్ అధికారి సాయిబాబా, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# సరస్వతి పుష్కరాల పనుల్లో వేగం పెంచాలి: కలెక్టర్ రాహుల్ శర్మ

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ .**



**జయశంకర్ భూపాల్ పల్లి మార్చి13 (సమయం న్యూస్) :** గురువారం కాళేశ్వరం ఈ ఓ కార్యాలయంలో ఎస్పి కిరణ్ ఖరేతో కలిసి సరస్వతీ పుష్కరాలు సందర్భంగా చేపడుతున్న పనులపై పంచాయతి రాజ్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యు ఎస్, వైద్య, దేవస్థానం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 25 వరకు పుష్కరాల అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో జాప్యం తగదని, వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఘాట్లు, రోడ్లు, శానిటేషన్, తాగునీటి సదుపాయాల పనులను గడువులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో సంబంధిత శాఖల సమన్వయం ఎంతో ముఖ్యమని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వివిఐపీ ఘాటును సందర్శించి వివిఐపీ ఘాట్ నుంచి స్నాన ఘట్టాల వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం, సరస్వతి తల్లి విగ్రహ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ వాచ్ టవర్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ స్థలాలు గుర్తించి నివేదిక అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, పీఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, డిపిఓ నారాయణరావు, విద్యుత్ శాఖ డీఈ రామిరెడ్డి, దేవ స్థానం ఈవో మహేష్, ఆర్కి టెక్చర్ సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# జనాభా పెరుగుదల.. దుర్మార్గపు ఆలోచన !

రాజకీయ నాయకుల ఆలోచనలు..వారి చర్యలు ఎంత ప్రమాదకరంగా ఉంటాయో తాజాగా జరుగుతున్న ఉదంతాలే నిదర్శనం. ముఖ్యంగా తమిళనాట డిఎంకె చేస్తున్న విన్యాసాలు జుగుప్సను కలిగిస్తున్నాయి. దీనికి కొన్ని రాజకీయ పార్టీలు వంతపాడుతున్నాయి. వీరి ఆలోచనలను ప్రథమంగా ప్రజలు పాతరేయాలి. హోళీ సందర్భంగా వీరి దురాలోచలనను తగలబెట్టాలి. వారి దుర్మార్గాలపై రసాయన రంగునీళ్లు చల్లాలి. అవసర మైతే ఎక్కడిక్కడే నిలదీయాలి. రాజకీయ పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం ఎంతకైనా తెగిస్తారని గుర్తించాలి. ఇందులో ఒకటి నియోజకవర్గాల పునర్విభజన...మరోటి జనభా పెరుగుదల. వీటితో పాటు హిందీ వ్యతిరేకత. జనాభా పెరుగుదల గురించి రాజకీయ పార్టీలు విపరీత వ్యాఖ్యలు చేస్తున్నాయి. ఇప్పటికే జనవిస్ఫోటనంతో దేశంలో ఆకలి, దరిద్రాలను అనుభవిస్తోంది. ఉన్న జనానికే సౌకర్యలు లేవు. ఉద్యోగాలు లేవు. ఉపాధి లేదు. దేశం వీరిని భరించే స్థితిలో లేదు. ఈ సమయంలో జనాభా నియంత్రణ గురించి మాట్లాడాల్సిన రాజకీయపార్టీలు తమ సీట్ల రాజకీయ కోసం జనాభాను పెంచాలన్న ప్రతిపాదనతో వస్తున్నాయి. విజినరీ చంద్రబాబు కూడా జనాభా గురించి మాట్లాడుతున్నారు. మరి ఆయన తనయుడు ఒక్కరినే ఎందుకు కన్నారో చెప్పాలి. జనాభా కారణగా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు తగ్గుతాయన్న భయంతో జనాభా పెరగాలన్న డిమాండ్‌ను డిఎంకె చేపట్టింది. వీరీ సీట్ల కోసం జనం త్యాగాలు చేయాలి. పిల్లలను కని రోడ్డున పడేయాలి. వారేమైనా ఫర్వాలేదు. వీరికి మాత్రం సీట్లు పెరిగితే, సీట్లతో రాజకీయ పదవులను అనుభవించవచ్చు. ఇదీ వీరి రాజకీయం. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి ఉండదు. జనాభా పెరుగుదల అన్నది భారత్‌ను ఎంతగా దెబ్బతీస్తున్నదో తెలుసుకోలేని మూర్ఖ రాజకీయ నేతలు మనకు దాపురించారు. ఈ విషయాల్లో తమిళనాడులోని డిఎంకె రచ్చ చేస్తోంది. పిల్లలను కనండి అంటూ తండ్రీ కొడుకులు స్టాలిన్, ఉదయనిధులు ఢంకా బజాయిస్తున్నాయి. ఎందుకంటే మరోమారు అధికారంలోకి రావాలంటే రచ్చచేయాలి. అందుకే ఏడాది ముందునుంచే పక్కా ప్రణాళికతో రచ్చను మొదలు పెట్టారు. దానిని డిఎంకె తమిళనాడు నుంచి ఢల్లీవరకు తీసుకుని వెళ్లింది. ప్రధానంగా హిందీ వ్యతిరేకతను పరిశీలిస్తే.. ప్రజలు తమిళం తప్ప ఇతర భాషలు నేర్చుకుంటే ఎక్కడ తమ పీఠాలు కదులుతాయో అన్న భయం ముందు నుంచీ వీరికి ఉంది. తమిళనాడులో హిందీని ప్రవేశించకుండా చేయడంలో వీరి ఉద్దేశం అదే. ప్రజలు హిందీ నేర్చుకుంటే ఎక్కడ జాతీయ రాజకీయాల ప్రభావంలో పడిపోతారో అన్న భయమే వీరి హిందీ వ్యతిరేకతకు కారణం. విద్యార్థి దశ నుంచే ఇంగ్లీష్, హిందీ లాంటి భాషలు నేర్చుకుంటే దేశంతో పాటు, ప్రపంచాన్ని చుట్టి రావాచ్చు. దేశంలో సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునే వీలుంటుంది. కానీ దీనిని వ్యతిరేకించడం ద్వారా ప్రజలను తమిళానికే పరిమితం చేయాలన్న దుర్మార్గపు ఆలోచన డిఎంకెదని చెప్పడంలో తప్పులేదు. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంతమంచిదని తాజాగా రాజ్యసభ ఎంపి సుధామూర్తి చేసిన వ్యాఖ్యలు కనువిప్పు కావాలి. అలాగే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా పలు సందర్భాల్లో లోక్‌సభ వేదికగా హిందీవ్యతిరేకతపై తమిళ పార్టీలను ఏకిపారేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేస్తున్న కొద్దీ ఈ పక్రియపై వివాదాలు సృష్టించే పనిలో డిఎంకె పడిరది. కేవలం సీట్ల గురించి మాట్లాడితే బాగోదని జనాభా తగ్గుదల, హిందీ వివాదాన్ని డిఎంకె నెత్తికెత్తుకుంది. ఇప్పటికే 140 కోట్లు దాటిన భారత జనాభా ఇంకా పెరగాలి. సీట్లు పెరగాలి. తాము మాత్రమే అధికారంలో ఉండాలి అన్న ధోరణిలో రాజకీయ పార్టీల విన్యాసాలు ఉన్నాయి. దేశాన్ని కులాల వారీగా విభజించే పనిలో కాంగ్రెస్ పడిరది. జనాభా పేరుతో డిఎంకె, టిడిపిలు విపరీత విన్యాసాలు మొదలు పెట్టాయి. పునర్విభజన వల్ల తీవ్రంగా నష్టపోయే దక్షిణాది రాష్ట్రాలేనని ఓ పసలేని వాదనను తెరపైకి తెచ్చారు స్టాలిన్. అఖిలపక్ష భేటీకి పిలుపునిచ్చారు. అన్ని పార్టీల నేతలకు, ముఖ్యంగా దక్షిణాది నేతలకు లేఖలు రాసారు.ఈ క్రమంలో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు పునర్విభజన విధివిధానాలను తప్పుబడుతూ, జనాభా ప్రాతిపదికన కాకుండా దేశ ఆర్థికాభివృద్ధిలో తమ తమ రాష్ట్రాల భాగస్వామ్యం ఆధారంగా పునర్విభజన జరగాలంటున్నారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి.. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదిన ఒక్క సీటు కూడా తగ్గదని చెప్పారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే చెప్పారు. అయితే వీరి బాధ ఇది కాదు. రచ్చ చేయడం ద్వారా ప్రజల్లో ఇమేజ్ పెంచుకునే ఆలోచనలో డిఎంకె ఉంది. గతంలో రాహుల్ రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని, రాజ్యాంగానికి ముప్పు వాటిల్లిందని ఊరూవాడా తిరిగారు. జనాభా ప్రాతిపదికన జరిగే పునర్విభజన వల్ల తీవ్రంగా నష్టపోయేది దక్షిణాది రాష్ట్రాలే కనుక ఇప్పటినుంచి పిల్లలను కనాలని డిఎంకె ఇచ్చిన పిలుపును టిడిపి కూడా అందుకుంది. ఎపిలో ఉన్న వనరులతో అభిశృద్ధి చేయలేక గతంలోనే జగన్ చతికిల పడ్డారు. ఉన్న డబ్బును పెన్షన్లకే వెచ్చిస్తున్నారు. ఇదే పెద్ద పానా విజయంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఈ దశలో జనాభా పెంచాలని చంద్రబాబు లాంటి విజినరీనేత మాట్లాడడం ఆశ్చర్యంగా ఉంది. జనాభా ప్రాతిపదికన ఓ సీటు తగ్గితే కొంపలేం మునుగుతాయి. కుటుంబ నియంత్రణపై గతంలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషి వల్ల జనాభా తగ్గిందని అంటున్నారు. ఇదే నిజమైతే..ఉత్తరాదిలో కూడా ఇలాగే చేయాలని డిమాండ్ చేయాలి. ఉత్తరాదిలో కూడా జనాభా నియంత్రణ చర్యలకు చంద్రబాబు సూచనలు చేయవచ్చు. కుటుంబ నియంత్రణపై కేంద్రంలోని పెద్దలు గతంలో ఇచ్చిన ఆదేశాలను తూచ తప్పక పాటించి, జనాభా పెరుగుదలను నియంత్రించేచేలా చేయాలి. ఇప్పుడున్న దేశానికి ఇంత జనాభా అసవరం లేదని గుర్తించాలి. జనాభాతో సీట్లు దక్కించుకునే దుర్మార్గపు ఆలోచన వియరమించి జనాభా నియంత్రణకు పూనుకోవాలి. దేశవ్యాప్తంగా ఇది అమలు కావాలి. హిందీ వ్యతిరేకేతను డిఎంకె వీడాలి. ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్న పార్టీలకు ప్రజలు సమయం చూసి బుద్ది చెప్పకపోతే నష్టపోయేది మనమేనని గుర్తించాలి.

# డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం

* **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**మార్చి 13, సమయం న్యూస్ :** జనాభా ఆధారంగా కేంద్ర ప్రభు త్వం జరపాలనుకుంటున్న డీ లిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. భారత ప్రభుత్వ సూచన మేరకు కుటుంబ నియంత్రణ ను పకడ్బందీగా అమలుచేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించాలనుకోవడం దారుణమన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో మార్చి 22 న చెన్నైలో నిర్వహించబోతున్న సమావేశానికి బీఆర్ఎస్ ను ఆహ్వానించేందుకు హైదరాబాద్ వచ్చిన డిఎంకె నేతలు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ మరియు నీటి సరఫరా మంత్రి



కె.ఎన్. నెహ్రూ, రాజ్యసభ ఎంపీ ఎన్.ఆర్. ఎలాంగో బృందంతో తెలంగాణ భవన్ లో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం రెండు పార్టీల నేతలు మీడియాతో మాట్లాడారు. డీ లిమిటేషన్ మీద దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాల్సిన సందర్భం ఇది. తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ సమష్టిగా పోరాడినట్లయితే తప్పకుండా దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుంది. 197080 దశకంలో ఫ్యామిలీ ప్లానింగ్ బాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ స్థానాలను కొత్తగా వచ్చిన సెన్సెస్ ప్రకారం నిర్ణయిస్తాము అనడం అన్యాయం. ఫలితంగా పార్లమెంట్ లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుంది. ఈ విషయంలో స్టాలిన్ గారు ఏర్పాటుచేస్తున్న అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్ తరపున హాజరుకావాలని కేసీఆర్ గారు ఆదేశించారు. కేసీఆర్ ఆదేశం ప్రకారం మార్చి 22 న జరిగే సమావేశానికి హాజరై బీఆర్ఎస్, తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తాం. డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మొదటి నుంచి ప్రశ్నిస్తున్నారు. అందుకే మార్చి 22న దక్షిణాదిలోని అన్ని పార్టీలతో చెన్నైలో సమావేశం ఏర్పాటుచేస్తున్నారు. ఆ సమావేశంలో అన్ని పార్టీలతో చర్చించి ఉమ్మడి కార్యచరణను ప్రకటిస్తాం. ఈ సమావేశానికి హాజరు అవుతామని బీఆర్ఎస్ చెప్పింది. అందుకు ధన్యవాదాలు.

# అగ్నివీరులకు దరఖాస్తు

* **జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, ట్రేడ్స్మన్ విభాగంలో పోస్టుల భర్తీ**

**రాయపోల్ మార్చి 13, సమయం న్యూస్ :** భారత సైన్యంలో 202526 సంవత్సరానికి అగ్నివీర్ విభాగం లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయిందని ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్(రిటైర్డ్ ఆర్మీ) నీల చంద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్నివీర్ విభాగంలో జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, ట్రేడ్స్మన్ విభా గంలో పోస్టులు భర్తీ చేయనున్నట్లు సికింద్రా బాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అని అన్నారు.ఈనెల 12 నుంచి ఏప్రిల్ 10 మధ్య ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూన్లో ఆన్లైన్లో పరీక్ష ఉంటుంది. దరఖా స్తుదారులు



తమ అర్హతలను బట్టి ఏవైనా రెం డు కేటగిరీలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చు. 2004 అక్టోబర్ 1 నుంచి 2008 ఏప్రిల్ 1న మధ్య జన్మించిన పెళ్లికాని పురుషులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. నియామక ప్రక్రియ పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా జరుగుతుందని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.



## కుమారుడి వావిహానికి ఆహ్వానించిన కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డి

**అంబర్ పేట, మార్చి 13, సమయం న్యూస్:** అంబర్ పేట నియోజకవర్గం బాగ్ అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ పద్మ వెంకటరెడ్డి దంపతులు బుధవారం జూబ్లీహిల్స్ నంది నగర్ లో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఏప్రిల్ 12న తన కుమారుడు నరేన్ సాయి రెడ్డి వివాహానికి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబర్ పేట ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ గారు కూడా ఉన్నారు.

# అంబర్ పేట్ డివిజన్ లో పర్యటించిన కార్పొరేటర్



* **ఇ.విజయ్ కుమార్ గౌడ్**

అంబర్ పేట, మార్చి 13, సమయం న్యూస్: అంబర్ పేట కార్పొరేటర్ ఇ . విజయ్ కుమార్ గౌడ్ గారు స్థానిక నాయకులు, బస్తి ప్రజలతో కలిసి స్థానికంగా ఉన్నటువంటి సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులను సిబ్బందిని పిలిపించి రోడ్ ప్యాచ్ వర్క్ పనులు వెంటనే పూర్తి చేయాలని, స్వచ్ఛమైన మంచినీటీని కాలనీ ప్రజలకు అందించాలని,ఇంటింటికి తిరుగుతూ మంచినీటీని పరిశీలించడం జరిగింది. అలాగే రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు రావడంతో సంబంధిత సిబ్బందిని పిలిపించి వెలగని విద్యుత్ దీపాలని వెంటనే బాగు చేయాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది వర్క్ ఇన్స్పెక్టర్లు రమేష్,దుర్గ, విద్యుత్ సిబ్బంది సాయి, స్థానిక బస్తి ప్రజలు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రంగు సతీష్ గౌడ్,యూసుఫ్ బాబా,రహీం,జాంగిర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యా బోధన

* **విద్యావ్యవస్థను పటిష్టం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం**
* **లక్ష రూపాయల వ్యయంతో కోమటిబండ ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు అందజేసిన దాతను సన్మానించిన డీఈవో శ్రీ నివాస్ రెడ్డి**

**గజ్వేల్, మార్చి 13, సమయం న్యూస్ :** ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు రూ. లక్ష విలువైన బెంచ్ లను అందజేసిన తూం పద్మ మ్మను ఆయన సన్మానించారు. అలాగే గ్రామానికి చెందిన ఉబ్బని ఆంజనేయులు విద్యార్థుల కోసం బహుకరించిన స్టీల్ వాటర్ బాటిల్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పరిస్థితులు మారిపోయాయి అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన జరుగుతుందన్నారు. ప్రాథమిక విద్య నుండే చిన్నారులు ఇంగ్లీష్ లో మాట్లాడే విధంగా ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారన్నారు. ప్రజలు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్పొరేట్లో వేల రూపాయలు ఖర్చుపెట్టి పొందే విద్య, వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా లభిస్తున్నాయన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక, కరాటే తదితర అంశాలలో అన్ని రకాలుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించారన్నారు.




ప్రభుత్వ పాఠశాలల అవసరాలు తెలుసుకొని గ్రామాలలో విద్యార్థులను ప్రోత్సహించడానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో పాఠశాలకు మరింత సహకారం అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అలీ అహ్మద్, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజుగౌడ్, నర్సింలు, మాజీ సర్పంచ్ తుమ్ శేఖర్ పటేల్, నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక



# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**
* **టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం**



**నిజామాబాద్, మార్చి 13 (సమయం న్యూస్) :** మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అద్భుతాలు సాధించగలరని అన్నారు. ఏ రంగంలో ఉన్న బాధ్యతలు మర్చిపోవద్దని, అందుబాటులో ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తెచ్చిందని, క్యాంటీన్ల నిర్వహణ, యూనిఫాం లు కుట్టే బాధ్యతలను అప్పగించిందని అన్నారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, మహిళా ఉద్యోగులు ఇంటి పనులు, ఉద్యోగ విధులను సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను, వివిధ రంగాలలో ప్రముఖంగా సేవలు అందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, జిల్లా పౌర సంబంధాల అధికారిణి నార్ల పద్మశ్రీ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, టీఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, శేఖర్ తదితరులున్నారు

## రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి

* **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్**

**నిజామాబాద్, మార్చి 13 (సమయం న్యూస్) :** ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ తదితర వాటితో ముడిపడిన అంశాల గురించి చర్చించేందుకు వీలుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఈ.ఆర్.ఓలతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించే కలెక్టర్లతో పాటు ఈ.ఆర్.ఓలు తమతమ స్థాయిలలో పొలిటికల్ పార్టీ మీటింగ్ లు ఏర్పాటు చేసి అప్‌డేట్స్ అందించాలన్నారు. సమావేశాల తేదీ, సమయాన్ని ఖరారు చేస్తూ ముందస్తుగానే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, సమావేశాల వివరాలను సీఈఓ కార్యాలయానికి, గుర్తింపు పొందిన పార్టీల ప్రధాన కార్యాలయాలకు కూడా పంపించాలని సూచించారు. కాగా, ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్తగా వచ్చిన దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ సకాలంలో పరిష్కరించాలని సీ.ఈ.ఓ సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ
# మద్దతు ధర పై వరి పంట కొనుగోలు సన్నద్ధం కావాలి

: **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
* **కోనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన**
* **మార్చి 3వ వారంలో కోనుగోలు కేంద్రాల ఇంచార్జి లకు శిక్షణ అందించాలి**
* **ధాన్యం రవాణా కు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేయాలి**
* **యాసంగి ధాన్యం కొనుగోలు సన్నద్ధత పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, మార్చి 13 ( సమయం న్యూస్):** యాసంగి మార్కెటింగ్ సీజన్ లో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను తూచా తప్పకుండా పాటిస్తూ మద్దతు ధర పై వరి పంట కొనుగోలుకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, యాసంగి మార్కెటింగ్ సీజన్ 202425 లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చివరి గింజ వరకు నాణ్యమైన వడ్లను మద్దతు ధరపై కొనుగోలు చేసి 48 గంటల్లో చెల్లింపులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసే అవకాశం ఉందని, దీనికి తగ్గట్టుగానే అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అవసరమైన మేర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాల జాబితా, ఇంచార్జిలను ఫైనల్ చేసి మార్చి 3వ వారంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు గన్ని బ్యాగులు.. మొదలకు సామాగ్రి అందుబాటులో ఉందో లేదో నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. మార్కెటింగ్ అధికారితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సామాగ్రి కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. క్రాప్ బుకింగ్ ప్రకారం సన్న వడ్లు వేసిన రైతుల వివరాలు అందించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు, దొడ్డు వడ్లకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పంట కోతలు జరుగుతున్న నేపథ్యంలో హార్వెస్టర్లతో కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు త్వరితగతిన తరలించాలని అన్నారు . రైస్ మిల్లులో ఎట్టి పరిస్థితుల్లోనూ తాలు కట్ చేయడానికి వీలు లేదని, నాణ్యతను కొనుగోలు కేంద్రాల దగ్గరే పరిశీలించి పంపాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లుల వద్ద ఎక్కడ హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఎం మార్కెటింగ్ శ్రీకాంత్ , మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంథని మండల పాఠశాలల హెడ్మాస్టర్లతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, మార్చి 13 ( సమయం న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడం పై కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని మండలం ప్రాథమిక, ప్రాథమికోన్నత హెడ్మాస్టర్లతో ఎఫ్.ఎల్.ఎన్. పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పాఠశాలల సమర్థ నిర్వహణ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుల పటిష్ఠ పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందని అన్నారు . పాఠశాలల్లో గుణాత్మక విద్య మెరుగుపరచడానికి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుల పర్యవేక్షణ గురించి కీలకమైన సూచనలు కలెక్టర్ అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ లలో రాసి, చదివే సామర్థ్యాలను పెంచాలని, గణితంలో కనీస సామర్థ్యం ఉండేలా దృష్టి సారించాలని అన్నారు. మండలంలో కొన్ని పాఠశాలలు చక్కగా పనిచేస్తున్నాయని అభినందించారు. విద్యా సంవత్సరం ముగిసే లోగా ప్రతి పాఠశాలలో 60 నుండి 80% వరకు ప్రతి విద్యార్థికి చదవడం రాయడంతో పాటు గణితంలో కనీస సామర్థ్యాలు పెంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సమ న్వయకర్త పిఎం షేక్, సంబంధిత అధి కారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు

* **రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్**
* **కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష**

**నిజామాబాద్, మార్చి 13 (సమయం న్యూస్) :** యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐ.టి.ఐ, ఏ.టీ.సీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్ లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్ స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. అంతేకాకుండా స్థానిక పరిశ్రమలకు చేరువలో ఏటీసీలను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్టవచ్చని అన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడినట్లు అవుతుందన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుంటూ అనువైన ప్రదేశాలలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే పంపాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, జిల్లాలోని ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఏ.టీ.సీ కేంద్రాల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను సోమవారం లోపు పంపిస్తామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత, విత్తన శుద్ధి పరిశ్రమలకు అనుగుణంగా ఏటీసీ కేంద్రాలలో కోర్సులను ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. జూమ్ మీటింగ్ లో సంబంధిత శాఖల అధికారులు, ఐ.టి.ఐ కళాశాల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

# పంట వ్యర్థాల తో సేంద్రీయ ఎరువుల తయారు లో రైతులకు అవగాహన కల్పించాలి

* **జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్గొండ మార్చి13, (సమయం న్యూస్) :** పంట వ్యర్థాలను వృధాగా పారేయకుండా దానితో జీవబొగ్గు (బయో చర్) ను ఉత్పత్తి చేసి తిరిగి పొలంలో వేసినట్లైతే కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవ సరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా, కట్టంగూరు మండలం, చెరువు అన్నారంలో పంట వ్యర్థాలతో తయారు చేస్తున్న బయోచార్ సంస్థ "తపోవనం బయోచార్" ఫాక్టరీ ని సందర్శించారు.బయోచార్ అనేది పంట వ్యర్థాలైన సహజ వనరుల ద్వారా వచ్చేది. దీని ద్వారా నాణ్యమైన పంటలు పండించడంలో , మట్టి నాణ్యత పెంచడంలో ఎంతగానో ఉపయోగకరమైన ఒక పదార్థం. దీనిని జీవబొగ్గు అని కూడా అంటారు. ఆక్సిజన్ లేకుండా పత్తి కట్టెను ,వరి గడ్డిని, అలాగే ఇతర పంట వ్యర్థాలను వేడి చేసి కట్టెలో సేంద్రియ కర్బనం నిలువ చేయడం ద్వారా బయోచార్ అనేది తయారవుతుంది. నల్గొండ ప్రాంతంలోని పొలాలలో ప్రస్తుతం కర్బనం 0.3 శాతం కంటే ఎక్కువగా లేదు. దీనిని ఒక శాథానికి పెంచడం వల్ల వ్యవసాయంలో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధ్యమ వుతాయి. చాలామంది రైతులు ప్రత్యే కించి పత్తి రైతులు పంట కోసిన అనంతరం మిగిలిపోయిన పత్తి కట్టెలను అక్కడికక్కడే కాల్చి వేస్తున్నారు.దీనివల్ల వాయు కాలుష్యంతో పాటు ,విలువైన సహజ వనరు వృధా అవుతుంది. ఇలా వృధా కాకుండా బయోచర్ సంస్థ వాటిని సేకరించి ప్రాసెసింగ్ ద్వారా బయోచార్ (జీవ బొగ్గు)గా మార్చి తిరిగి రైతులకు ఇవ్వడం జరుగుతుంది. దీనిని మట్టిలో వేస్తే మట్టిలోని లోపాలను పూరించేందుకు ఇది ఎంతగానో సహాయపడుతుంది. అంతేకాక నీటి నిల్వలను మెరుగుపరచడం, సాగునీటి వినియోగం తగ్గించడం, మొక్కల వేరు వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి రోగాలను సైతం తగ్గిస్తుంది. అలాగే రసాయన ఎరువుల అవసరాన్ని కూడా



తగ్గించి రైతులకు ఖర్చులను తగ్గిస్తుంది. ఒకవేళ పత్తికట్టెను కాల్చినట్లైతే వాయు కాలుష్యం పెరగడమే కాకుండా, దీనివల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఒక ఔత్సాహిక పారిశ్రామిక వేత్త కట్టంగూర్ మండలం చెరువు అన్నారం శివారులో తపోవనం బయోచార్ పేరున ఫ్యాక్టరీ ని ఏర్పాటు చేయడం జరిగింది. దీని ద్వారా రైతుల నుంచి పంట వ్యర్థాలను సేకరించి బయో చార్ గా మార్చి తిరిగి వారి పంట పొలాల్లో వేసుకునేందుకు ఉచితంగా ఈ సంస్థ అందజేస్తున్నది .పర్యావరణాన్ని కాపాడుతున్నందుకుగాను కాలుష్య నివారణకు తోడ్పాటు చేస్తున్నందుకు ఈ సంస్థకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సహకారం ఉంటుంది. ఈ విషయంపై అవగాహన కోసం జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వరరావు తోపాటు, కట్టంగూరు రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య లిమిటెడ్ స్థాపకులు, మాజీ శాసనసభ్యులు నరసింహారెడ్డిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వ్యవసాయ పంట పొలాల వ్యర్థాల సేకరణ, తదితర వివరాలన్నింటిని సంస్థ ప్రతినిధుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కలిగించినట్లయితే పంట వ్యర్థాలను వృధా చేయకుండా బయోచార్ ద్వారా తిరిగి పంట పొలాలకు వినియోగించుకోవచ్చని, దీనిద్వారా కాలుష్య నివారణతో పాటు, భూమి నాణ్యత పెరిగి ఎక్కువ పంటలు, అధిక దిగుబడి రావడానికి అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున రైతుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. పంట పొలాల వ్యర్థాల ద్వారా వచ్చే బయో చార్ ,పంట పొలాలపై వినియోగం, తదితర అంశాలను బయోచార్ తయారీకి వినియోగించే యంత్ర పరికరాలు అన్నింటిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి,కట్టంగూర్ తహసిల్దార్ మధు, వ్యవసాయ అధికా రులు, తదిత రులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.




## అదుపు తప్పిన ట్రాక్టర్ వ్యక్తికి తీవ్ర గాయాలు

**రాయపోల్, మార్చి 13. సమయం న్యూస్ :** సిద్దిపేట జిల్లా రాయపోలు మండల కేంద్రనికి చెందిన బైండ్ల సత్తయ్య (55 )S % నారాయణ తన వ్యవసాయ పొలానికి ట్రాక్టర్ పై వెళ్తుండగా అదుపు తప్పడంతో తన యొక్క రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి వెంటనే అక్కడ స్థానికులు 108 అంబులెన్స్ కి సమాచారం ఇవ్వగా దౌల్తాబాద్ అంబులెన్స్ సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ భాను పైలెట్ నరసింహులు అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ గజ్వేల్ కి తరలించారు.. అత్యవసర మెడికల్ ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ప్రజలు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ మరియు జిల్లా కోఆర్డినేటర్ హరి రామకృష్ణ కోరారు..

## ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యా బోధన

* విద్యావ్యవస్థను పటిష్టం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం
* లక్ష రూపాయల వ్యయంతో కోమటిబండ ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు అందజేసిన దాతను సన్మానించిన డీఈవో శ్రీ నివాస్ రెడ్డి






**గజ్వేల్, మార్చి 13, సమయం న్యూస్ ::** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు రూ. లక్ష విలువైన బెంచ్లను అందజేసిన తూం పద్మమ్మను ఆయన సన్మానించారు. అలాగే గ్రామానికి చెందిన ఉబ్బని ఆంజనేయులు విద్యార్థుల కోసం బహుకరించిన స్టీల్ వాటర్ బాటిల్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పరిస్థితులు మారిపోయాయి అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన జరుగుతుందన్నారు. ప్రాథమిక విద్య నుండే చిన్నారులు ఇంగ్లీష్ లో మాట్లాడే విధంగా ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారన్నారు. ప్రజలు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్పొరేట్లో వేల రూపాయలు ఖర్చుపెట్టి పొందే విద్య, వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా లభిస్తున్నాయన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, కరాటే తదితర అంశాలలో అన్ని రకాలుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అవసరాలు తెలుసుకొని గ్రామాలలో విద్యార్థులను ప్రోత్సహించడానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో పాఠశాలకు మరింత సహకారం అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అలీ అహ్మద్, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజుగౌడ్, నర్సింలు, మాజీ సర్పంచ్ తుమ్ శేఖర్ పటేల్, నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 17 మంది మావోయిస్టుల లొంగుబాటు..
## 9మంది తలలపై ₹24లక్షల రివార్డు

**సమయం న్యూస్ , బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్ లోని బీజాపూర్ జిల్లాలో 17మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 9మంది తలలపై రూ.24లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు దినేష్ మొడియం (36), అతడి భార్య జ్యోతి తాటి అలియాస్ కళా మొడియం (32) ఉన్నట్లు తెలిపారు. దినేష్ తలపై రూ.8లక్షలు, జ్యోతిపై రూ.5లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. అలాగే, ఏరియా కమిటీ సభ్యులు దుడ్ల కరంపై రూ.5లక్షలు, మరో ఆరుగురి తలలపై రూ.లక్ష చొప్పున రివార్డు ఉందన్నారు. వీరందరూ



గంగలూరు ఏరియా కమిటీలో వివిధ హోదాల్లో చురుగ్గా ఉన్నవారేనన్నారు. వీరి లొంగుబాటు వెనుక డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డు, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఎస్పీ వివరించారు. సైద్ధాంతిక లోపాలు, అమాయక గిరిజనుల పట్ల కొందరు సీనియర్లు దోపిడీకి పాల్పడటం వంటి చర్యలతో కలత చెందడం, భద్రతా బలగాల ప్రభావం పెరిగిన నేపథ్యంలో వీరంతా లొంగిపోయినట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ తెలిపారు. అలాగే, గ్రామాల్లో అభివృద్ధి కోసం తాము చేపట్టిన నియా నెల్లనార్' (యువర్ గుడ్ విలేజ్) అనే పథకం పట్ల ఆకర్షితులయ్యారన్నారు. లొంగిపోయిన వారికి రూ. 25వేలు చొప్పున సహాయం అందించామని.. ప్రధాన స్రవంతిలోకి చేర్చేందుకు ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది బస్తర్‌లో 792మంది మావోయిస్టులు లొంగిపోగా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీజాపూర్ జిల్లాలో 65మంది లొంగిపోయారు.

## మంత్రి పదవి ఎప్పుడు వస్తుందనేది చెప్పలేను

**: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి**



మార్చి 13. సమయం న్యూస్ , హైదరాబాద్: 'నాకు మంత్రి పదవి ఇస్తే పార్టీకి, ప్రజలకు లాభం. కానీ, మంత్రి పదవి ఎప్పుడు వస్తుందనేది చెప్పలేను' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివిధ అంశాలపై స్పందించారు. ''భువనగిరి ఎంపీ స్థానం కోసం నిద్రాహారాలు మాని గెలిపించా. స్పీకర్ కుర్చీని ఎవరూ ప్రశ్నించలేరు. జగదీశ్‌రెడ్డి స్పీకర్ ఛైర్‌ను ప్రశ్నించడం సరికాదు. అసెంబ్లీలో అతిగా ప్రవర్తించారు, స్పీకర్‌ను అవమానించినందుకే ఆయనపై చర్యలు తీసుకున్నారు. మేము ఎవరినీ లక్ష్యంగా చేసుకోం.. తప్పు చేస్తే వదిలిపెట్టం'' అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

## నిజంగా అంత బాధ ఉంటే..
## నిర్మలమ్మ వ్యాఖ్యలకు విజయ్ కౌంటర్

**మార్చి 13. సమయం న్యూస్ , చెన్నై:** ప్రముఖ సంఘసంస్కర్త పెరియార్‌పై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన విమర్శలను తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ తీవ్రంగా ఖండించారు. ఏళ్లు గడిచినా ఆయన పేరు వాడకుండా ఉండలేని విధంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని కౌంటర్ ఇచ్చారు. తమిళాన్ని అవమానించిన వ్యక్తికి పూలమాలలు వేస్తున్నారంటూ ఈవీకే పెరియార్‌ను పరోక్షంగా ప్రసావిస్తూ రాజ్యసభలో సీతారామన్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన విజయ్.. సమాజంలో సాంఘిక దురాచారాలు పారదోలడానికి పెరియార్ చేసిన కృషిని కొనియాడారు. ''బాల్య వివాహాలను వ్యతిరేకించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు. కులం పేరిట జరిగిన అకృత్యాలను ఖండించారు. ఇలా మనం ఆయన గురించి చెప్తూపోవచ్చు. సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు ఉండాలని మనం ఇప్పుడు మాట్లాడుతున్న మాటలను ఆయన వందసంవత్సరాల క్రితమే పిలుపునిచ్చి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పెరియార్ తమిళ



భాషను అవమానించినందుకు కేంద్రమంత్రి నిజంగానే బాధపడ్డారా..? మీరు నిజంగా బాధపడి ఉంటే.. త్రిభాషా సూత్రాన్ని మాపై రుద్దడం ఆపేస్తారా..? పెరియార్ గురించి ఎవరైనా అవమానకర వ్యాఖ్యలు చేస్తే.. అవి వివాదాస్పదం అవుతుంటాయి. తమిళనాడు ప్రజల మనసులో ఆయన ఎలా నిలిచి ఉన్నారో, ఆయన్ను ఎలా గౌరవిస్తున్నారో ఈ ఒక్క ఉదాహరణ చాలు'' అని విజయ్ అన్నారు. జాతీయ విద్యా విధానంలోని (ఎన్‌ఈపీ2020) త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోంది. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా.. హిందీని అందరిపై రుద్ద డానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రంపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తిప్పికొట్టారు. విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిప డ్డారు. విద్యా విధానాల అమలు విష యంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించా లని హితవు పలికారు. ఎన్‌ఈపీ 2020లోని కీలక అంశాలను, ముఖ్యంగా త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించిన కారణంగా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) కింద అందించాల్సిన రూ.573 కోట్లను నిలిపేసింది. ఎన్‌ఈపీ మార్గదర్శకాలు అమలు పరిస్తేనే కేంద్రం తన వాటా నిధులు అందిస్తుందని విధాన నిబంధనలు చెబుతున్నాయి. ఇలా కేంద్రం, తమిళనాడు మధ్య వివాదం నడుస్తోన్న వేళ.. నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు విమర్శలకు దారితీశాయి.

## తెలంగాణ అసెంబ్లీ నుంచి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్

మార్చి 13. సమయం న్యూస్ , హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ నుంచి భారాస ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. స్పీకర్ పట్ల వ్యాఖ్యలు చేసిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని మంత్రి సీతక్క శాసనసభలో ప్రతిపాదించారు. శాసన వ్యవస్థను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల విషయాన్ని ఎథిక్స్ కమిటీకి పంపాలని సూచించారు. బడ్జెట్ సెషన్స్ ముగిసే వరకు జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయాలని సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించగా.. స్పీకర్ ఆమోదించారు. జగదీశ్‌రెడ్డి వెంటనే సభ నుంచి వెళ్లి పోవాలని స్పీకర్ ఆదేశించారు. జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌పై భారాస సభ్యులు నిర సనకు దిగారు. తమకు మాట్లాడే అవ కాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఛాంబర్‌లో కూర్చొన్న జగదీశ్‌రెడ్డి వద్దకు చీఫ్ మార్షల్ వచ్చి అసెంబ్లీ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. సభ నుంచి



మాత్రమే సస్పెండ్ చేశారని, ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో కూర్చుంటే అభ్యంతరమేంటని భారాస ఎమ్మెల్యేలు ప్రశ్నించారు.

**ఏం జరిగిందంటే?**

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్, భారాస సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. ''ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరఫున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు'' అని వ్యాఖ్యానించారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు.

## ఆప్‌కు మరో షాక్.. సిసోదియా, జైన్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు రాష్ట్రపతి అనుమతి!

**ఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఆ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలపై కేసుల నమోదుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఢిల్లీలోని పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణంలో రూ.1300 కోట్ల మేర కుంభకోణం జరిగిందనే ఆరోపణలపై మనీష్ సిసోదియా, సత్యేందర్ జైన్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు**






**రాష్ట్రపతి అనుమతి ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ 2400 తరగతి గదుల నిర్మాణంలో స్పష్టమైన అవకతవకలు ఉన్నట్లు కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ) 2020 ఫిబ్రవరి 17న ఓ నివేదికలో పేర్కొంది. ఈ క్రమంలోనే 2022లో ఢిల్లీ ప్రభుత్వ విజిలెన్స్ డైరెక్టరేట్ ఈ కుంభకోణం ఆరోపణలపై దర్యాప్తునకు సిఫారసు చేస్తూ ప్రధాన కార్యదర్శికి నివేదికను సమర్పించింది. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ హయాంలో మంత్రులుగా ఉన్న వీరిద్దరిపైనా ఎఫ్ఐఆర్ నమోదుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్లు సమాచారం. గతంలో మద్యం విధానం కేసులో సిసోదియా, మనీలాండరింగ్ కేసులో సత్యేందర్ జైన్ అరెస్టయ్యి ఆ తర్వాత బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే.**

# బిజినెస్ BUSINESS

## క్విక్ కామర్స్‌లోకి అర్బన్ కంపెనీ.. 15 నిమిషాల్లో ఇంటికి వర్కర్లు




ఒకప్పుడు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన వస్తు వులు ఇంటికి రావాలంటే రోజులు పట్టేది. తర్వాత ఆ పరిస్థితి మారింది. క్విక్ డెలివరీలు అంటూ నిమిషాల్లోనే వస్తువుల్ని ఇంటి వద్దకు తెచ్చి ఇస్తున్నారు. కిరాణా వస్తువుల దగ్గర నుంచి మొదలైన క్విక్ కామర్స్ సేవలు.. దుస్తులు, ఎలక్ట్రిక్ గ్యాడ్జెట్‌లకూ విస్తరించాయి. ఇప్పుడు అర్బన్ కంపెనీ అదే దారిని ఎంచుకుంది. ఇంటి పని కోసం 15 నిమిషాల్లోనే వర్కర్లను పంపించనుంది. ఇందుకోసం తాజాగా 'యూసీ ఇన్‌స్టా మెయిడ్' సేవలకు శ్రీకారం చుట్టింది. ఇల్లు ఊడవడం, తుడవడం, వంట పని వంటి పనుల కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొనే సదుపాయాన్ని అర్బన్ కంపెనీ ఇప్పటికే అందిస్తోంది. ఈ సేవల్ని మరింత చేరువ చేయడంలో భాగంగా తాము కూడా క్విక్ కామర్స్ విభాగంలోకి అడుగు పెట్టినట్లు ప్రకటించింది. కేవ లం 15 నిమిషాల్లోనే వర్కర్లను ఇంటికి పంపిస్తామని పేర్కొంది. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ముంబయిలోనే ఈ సేవల్ని ప్రారంభించింది. త్వరలోనే మరిన్ని నగరాలకు తన సర్వీసుల్ని విస్తరించనుంది. త్వరలోనే పబ్లిక్ ఇష్యూకు (IPO) అర్బన్ కంపెనీ రానున్న వేళ క్విక్ కామర్స్ విభాగంలోకి అడుగు పెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. క్విక్ కామర్స్ విభాగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటివి ఇప్పుడు దాదాపు అందరికీ సుపరిచితమే. దీంతో అనేక సంస్థలు ఈ సేవల్లోకి అడుగు పెడుతున్నాయి. స్నాబిట్, ల్యాప్‌మేట్, స్విష్, జింగ్, ఫస్ట్‌క్లబ్ వంటి స్టార్టప్ కంపెనీలు ఆయా నగరాల్లో క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్నాయి. 2022 ఆర్థిక సంవత్సరంలో 300 మిలియన్ డాలర్లుగా ఉన్న క్విక్ గ్రాసరీ డెలివరీ మార్కెట్ 2025 నాటికి 7.1 బిలియన్ డాలర్లకు చేరింది.

## మళ్లీ ఆల్‌టైమ్ గరిష్ఠానికి బంగారం ధర



దిల్లీ: తగ్గినట్లే తగ్గిన బంగారం ధర మళ్లీ పైకెగసింది. అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగిన డిమాండ్ కారణంగా దేశీయంగా మరోసారి పసిడి ధర ఆకాశాన్ని తాకింది. దేశ రాజధాని దిల్లీలో గురువారం 10 గ్రాముల 99.9 శాతం స్వచ్ఛమైన పుత్తడి ధర రూ.600 పెరిగి రూ.89,450కి చేరింది. ఫిబ్రవరి 20న పసిడి ధర రూ.89,450గా నమోదైంది. మళ్లీ దాదాపు 20 రోజుల తర్వాత బంగారం ధర మళ్లీ అదే స్థాయికి చేరిందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అటు వెండి సైతం ఒక్క రోజులో కిలోకు వెయ్యి రూపాయలు మేర పెరిగింది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూ.1,00,200గా ఉన్న వెండి ధర రూ.1,01,200కు చేరింది. ఇది ఐదు నెలల గరిష్ఠానికి సమానం. అంతర్జాతీయంగా చూస్తే బంగారం ఔన్సు ధర 2946 డాలర్లకు చేరింది. అమెరికాలో తాజాగా వెలువడిన ద్రవ్యోల్బణ గణాంకాలు పసిడి ధర పెరగడానికి కారణమయ్యాయి. అంచనాల కంటే తక్కువగా ద్రవ్యోల్బణం నమోదు కావడంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ కారణంతోనే బంగారం వైపు పెట్టుబడులు మళ్లుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు.

## ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ₹15వేల కోట్ల ఐపీఓకు సెబీ గ్రీన్‌సిగ్నల్!




దక్షిణ కొరియాకు చెందిన వినియోగ వస్తువుల తయారీ సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓకు సెబీ ఆమోదం లభించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించేందుకు సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐపీఓ కోసం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ గతేడాది డిసెంబర్‌లో సెబీకి దరఖాస్తు చేసుకోగా తాజాగా ఆమోదముద్ర పడింది. ఈ ఐపీఓ ద్వారా మార్కెట్ల నుంచి రూ.15వేల కోట్లు కంపెనీ సమీకరించనుంది. ఈ పబ్లిక్‌ఇష్యూ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ ద్వారా జరగనుంది. ప్రమోటర్ సంస్థ అయిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ 10.18 కోట్ల షేర్లను విక్రయించబోతోంది. హ్యుందాయ్ మోటార్‌ఇండియా, ఎల్‌ఐసీ, పేటీఎం, కోల్ ఇండియా తర్వాత దేశంలో అతిపెద్ద ఐపీఓల్లో ఐదో అతిపెద్ద ఐపీఓగా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ నిలవబోతోంది. రిఫ్రిజిరేటర్లు, వాషింగ్‌మెషిన్లు, మైక్రోఓవెన్ల సెగ్మెంట్‌లో ఎల్‌జీ ప్రధాన ప్లేయర్‌గా ఉంది. ఎయిర్ కండీషన్ సెగ్మెంట్‌లో రెండో స్థానంలో ఉంది. టెలివిజన్ కేట గిరీలోనూ రెండో స్థానంలో ఉంది. గతేడాది అతిపెద్ద ఐపీఓగా వచ్చిన హ్యుందాయ్ కూడా దక్షిణ కొరియాకు చెందిన సంస్థే కావడం గమనార్హం. మోర్గాన్ స్టాన్లీ, జేపీ మోర్గాన్, యాక్సిస్ క్యాపిటల్, బోఫా సెక్యూరిటీస్, సిటీ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.

## భారత్‌లో స్టార్‌లింక్ ఇంటర్నెట్ ఛార్జీలు ఇలా..

మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయాన్ని అందించాలనే లక్ష్యంతో ఎలాన్‌మస్క్ ఆధ్వర్యంలోని స్టార్‌లింక్ భారత్‌లో ప్రవేశించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఇప్పటికే భారత టెలికాం విభాగానికి అనుమతి పత్రాలను దాఖలు చేసింది. ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయి. కేంద్రం షరతులను సంస్థ ప్రతినిధులు అంగీకరించడంతో భారత్‌లోకి మార్గం సుగమం అవుతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు స్టార్‌లింక్ ప్రవేశాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించిన టాప్ టెలికాం ఆపరేటర్లు ఎయిర్‌టెల్, జియో ఆ కంపెనీతోనే ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అయితే సామాన్యులకు స్టార్‌లింక్ ఏమేరకు ప్లాన్లను తీసుకొస్తుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే కంపెనీ భూటాన్, అమెరికా వంటి దేశాల్లో సర్వీసులు అందిస్తోంది. ఆయా దేశాల్లో ఇంటర్నెట్ ఛార్జీలను అనుసరించి భారత్‌లో రేట్లు ఎలా ఉండవచ్చో నిపుణులు అంచనా వేస్తున్నారు.

**యూఎస్‌లో ఛార్జీలు ఇలా..**

* స్టార్‌లింక్ యూఎస్‌లో రెసిడెన్షియల్ విభాగంలో నెలకు రూ.6,976 నుంచి ప్లాన్లు అందిస్తోంది. కేబుల్ నెట్‌వర్క్‌కు ఎలాగైతే రూటర్ కొనుగోలు చేస్తామో.. అలాగే శాటిలైట్ సేవల కోసం కూడా పరికరాలకు ఒకసారి చెల్లించాల్సిన సొమ్ము అదనం. యూఎస్‌లో స్టాండర్డ్ ఎక్విప్‌మెంట్ కిట్ ధర రూ.30,443గా ఉంది.
* ఇక మొబైల్ సేవలు కావాల్సినవారు నెలకు కనీసం రూ.4,360 చెల్లించాల్సి ఉంటుంది. డేటా అపరిమితంగా అందుకోవచ్చు. 220 ఎంబీపీఎస్ వరకు స్పీడ్ ఆఫర్ చేస్తోంది.
* రెసిడెన్షియల్ లైట్, రెసిడెన్షియల్ ప్లాన్లలో కూడా వినియోగదారులు అపరిమిత డేటాను అందుకోవచ్చు.
* రోమింగ్ ప్లాన్ తీసుకునే వినియోగదారులు దేశవ్యాప్తంగా, ప్రయాణంలో, అంతర్జాతీయ ప్రయాణ సమయంలో కూడా వినియోగం, తీర ప్రాంతాల్లో కవరేజీ పొందవచ్చు. బిజినెస్ విభాగంలో నెలకు రూ.12,208 నుంచి రూ.4,36,000 వరకు ప్లాన్స్ ఉన్నాయి.

**భూటాన్‌లో ఇలా..**

ఇక భూటాన్‌లో రెసిడెన్షియల్ లైట్ ప్లాన్ కింద స్టార్‌లింక్ నెలకు రూ.3,000 చార్జ్ చేస్తోంది. ఈ ప్లాన్‌లో ఇంటర్నెట్ 23-100 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఆఫర్ చేస్తోంది. ఊక్లా నివేదిక ప్రకారం స్టార్‌లింక్ ఇంటర్నెట్ వేగం యూరప్‌లోని హంగరీలో అక్టోబర్-డిసెంబర్ కాలంలో గరిష్ఠంగా 135.11, కనిష్ఠంగా సైప్రస్‌లో 36.52 ఎంబీపీఎస్ నమోదైంది.

**మనదగ్గర ఇప్పటివరకు ఇలా..**

శాటిలైట్ ఇంటర్నెట్ చార్జీలతోపోలిస్తే మనదేశంలో మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ చాలా చవక. అటూ ఇటూగా రూ.20 చెల్లిస్తే ఒక జీబీ డేటా అందుకోవచ్చు. సుమారు రూ.50 నుంచి అన్‌లిమిటెడ్ ప్యాక్స్ లభిస్తాయి. హోమ్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్లు నెలకు కనీసం రూ.400 నుంచి ఉన్నాయి. హై-ఎండ్ ప్లాన్ అయితే నెలకు రూ.4,000 వరకు ఉంది. దీనిలో 10 జీబీపీఎస్ వరకు వేగం, అన్ని ఓటీటీ యాప్స్ సబ్‌స్క్రిప్షన్ కూడా అందుతుంది. రూటర్‌కు అయ్యే వ్యయమూ తక్కువే. శాటిలైట్ టెలికం కేవలం ఇంటర్నెట్‌కే పరిమితం. కాల్స్ చేయాలంటే ఓటీటీ యాప్స్‌పైన ఆధారపడాల్సిందే.

*** ఇండియాలో స్టార్‌లింక్ ఛార్జీలపై అంచనాలు..**

స్టార్‌లింక్ ఇంటర్నెట్ కోసం అవసరమయ్యే హార్డ్‌వేర్‌కు ప్రస్తుతం రూ.25,000రూ.35,000 మధ్య ఖర్చు అవుతుంది. నెలవారీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ రూ.5,000 రూ.7,000గా అంచనా వేస్తున్నారు. ఇంటర్నెట్ స్పీట్ 25220 ఎంబీపీఎస్ ఉంటుందని చెబుతున్నారు. ఆ ధర భారతదేశం సగటు బ్రాండ్‌బ్యాండ్ వ్యయం నెలకు రూ.700రూ.1,500 కంటే చాలా ఎక్కువ. బ్రాండ్‌బ్యాండ్ పోటీదారులకు ధీటుగా విస్తృతంగా ఇంటర్నెట్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు స్పేస్‌ఎక్స్ భారతదేశంలో నిర్దిష్ట ధరలను ప్రవేశపెట్టాల్సి ఉంటుంది.

**స్టార్‌లింక్ ప్రత్యేకతలు ఇవీ..**

* లోఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందిస్తారు. ఇందుకోసం స్పేస్‌ఎక్స్ ఉపగ్రహాలను వినియోగిస్తున్నారు.
* కక్ష్యలో ఉన్న ఉపగ్రహాలు: సుమారు 7,000
* శాటిలైట్ ఇంటర్నెట్ అందిస్తున్న దేశాలు: 100కుపైగా
* వినియోగదారులు: సుమారు 50 లక్షలు (2024 డిసెంబర్ చివరినాటికి) అమెరికాలో దిగ్గజ బ్రాండ్‌బ్యాండ్ కంపెనీలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గట్టి పోటీనిస్తోంది.
* రూరల్ కనెక్టివిటీ: మారుమూల ప్రాంతాలు, పల్లెలకు వేగంగా ఇంటర్నెట్ అందిస్తోంది. విద్య, ఆరోగ్య సేవలు, ఈ-కామర్స్‌కు వెన్నుదన్నుగా నిలుస్తోంది.
* భారత్‌లో పోటీ: దేశంలో 94.5 కోట్ల మంది బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు ఉన్నారు. అందులో 90.4 కోట్ల మంది వైర్‌లెస్/మొబైల్ ఇంటర్నెట్‌ను వాడుతున్నారు.




# టెక్నాలజీ

## ప్రియమైనవారికి ఓ స్మార్ట్‌ఫోన్ : రూ. 20వేల కంటే తక్కువ ధరలో..



మార్కెట్లో లెక్కకు మించిన స్మార్ట్‌ఫోన్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ కథనంలో రూ.20,000 కంటే తక్కువ ధరలో లభించే ఐదు బెస్ట్ ఫోన్స్ గురించి తెలుసుకుందాం..

**నథింగ్ సీఎమ్ఎఫ్ ఫోన్ 1**

మార్కెట్లో తక్కువ ధరకు లభించే ఫోన్లలో 'నథింగ్ సీఎమ్ఎఫ్ ఫోన్ 1' ఒకటి. ఇది రంగు రంగుల బ్యాక్ ప్యానెల్‌లను కలిగి ఉండటం వల్ల, మీకు నచ్చిన కలర్ మార్చుకోవచ్చు. దీనిని మరింత అందంగా డిజైన్ చేసుకోవడానికి కంపెనీ కొన్ని యాక్సెసరీస్ కూడా అందిస్తుంది. ఈ ఫోన్ ధర రూ. 15499 మాత్రమే. కెమెరా సెటప్, డిజైన్, ఫీచర్స్ అన్నీ కూడా అనుకూలంగా ఉంటాయి.

**రియల్‌మీ నార్జో 70 టర్బో**

సాధారణ ఉపయోగం కోసం మాత్రమే కాకుండా.. గేమింగ్ కోసం కూడా ఉపయోగపడే ఫోన్ 'రియల్‌మీ నార్జో 70 టర్బో'. దీని ధర రూ. 14,999. ఇది డ్యూయెల్ టోన్ బ్లాక్ ప్యానెల్.. ప్రీమియం అండ్ స్పోర్టీ అప్పీల్ ఇస్తుంది. చదరంగం ఆకారంలో ఉండే కెమెరా సెటప్ కూడా అకార్షణీయంగా ఉంటుంది. ఇందులో డైమెన్సిటీ 7300 ఎనర్జీ చిప్ ఉంటుంది.

**టెక్నో పోవా 6 ప్రో**

రూ. 20వేలు కంటే తక్కువ ధరలో లభించే స్మార్ట్‌ఫోన్లలో.. టెక్నో పోవా 6 ప్రో ఒకటి. దీని ధర రూ. 19999. ఇందులో 6000 mAh బ్యాటరీ ఉంటుంది. ఇది 70 వాట్స్ ఫాస్ట్ వైర్డ్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఈ ఫోన్ గొప్ప గేమింగ్ ఫోన్ కాదు, కానీ ఇందులోని డైమెన్సిటీ 6080 చిప్‌సెట్ కొంతవరకు గేమ్‌లకు కూడా ఉపయోగపడుతుంది. ఈ ఫోన్ 108 మెగా పిక్సెల్ మెయిన్ కెమెరా పొందుతుంది.

**లావా బ్లేజ్ డుయో**

రూ.16,999 ధర వద్ద లభించే ఈ స్మార్ట్‌ఫోన్.. సెకండరీ డిస్‌ప్లేతో ప్రత్యేకంగా ఉంటుంది. ఈ ఫీచర్ కలిగి సరసమైన ధరకు లభించే ఫోన్‌లలో ఇది బెస్ట్ మోడల్. ముందు నుంచి చూస్తే.. లావా బ్లేజ్ డుయో ఏ హైఎండ్ మాదిరిగా కనిపిస్తుంది. ఇది స్లిమ్ బెజెల్స్‌తో కూడిన 3D కర్వ్డ్ డిస్‌ప్లే పొందుతుంది. ఇది కూడా అన్ని విధాలా చాలా అనుకూలంగా ఉంటుంది.

# MOVIE TIME




టాకీస్: మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన అందాల భామ అనుపమ పరమేశ్వరన్ వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఓ వైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే .. మరో వైపు లేడీ ఓరియెంటడ్ సినిమాలతో ఆకట్టుకుంటుంది. అనుపమ పరమేశ్వరన్ ఫిబ్రవరి 1996లో కేరళలోని త్రిసూర్‌లో జన్మించారు. 2015లో అల్ఫోన్స్ పుత్రన్ దర్శకత్వం వహించిన ప్రేమమ్ చిత్రంతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకుంది. మొన్నటి వరకు సినిమాల్లో పద్ధతిగా కనిపించిన ఈ భామ ఇటీవల గ్లామర్ గేట్లు ఎత్తేసింది.

## అనుపమ పరదా సినిమాలో సమంత గెస్ట్‌రోల్?




మొన్నామధ్య వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో అనుపమ తన అందాలతో కవ్వించింది. సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో ఒకరిగా పాపులర్ అయిన అనుపమ.. ప్రస్తుతం తెలుగులో పరదా అనే చిత్రంలో నటిస్తుంది. అలాగే తమిళంలో మరిసెల్వరాజ్ దర్శకత్వంలో నటుడు ధ్రువ్ విక్రమ్ నటించిన బైసన్ సినిమాలో నటిస్తుంది. అలాగే రీసెంట్ గా అశ్వంత్ మరిముత్తు దర్శకత్వంలో నటుడు ప్రదీప్ రంగనాథన్ జోడిగా డ్రాగన్ అనే చిత్రంలో నటిస్తుంది. సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే తాజాగా అనుపమ సినిమా పరదా సినిమాలో ఓ సర్ ప్రైజ్ ఉంటుందని తెలుస్తుంది. పరదా సినిమాలో ఓ స్టార్ హీరోయిన్ కూడా నటిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఆ హీరోయిన్ ఎవరో కాదు. సౌత్ స్టార్ బ్యూటీ సమంత. ఫిలిం సర్కిల్‌లో వినిపిస్తున్న వార్తల ప్రకారం పరదా సినిమాలో సమంత ఓ కీలక పాత్రలో కనిపించనుందని అంటున్నారు. గతంలో అనుపమ సమంత ప్రధాన పాత్రలో నటించిన అఆ సినిమాలో నటించిన విషయం తెలిసిందే. అనుపమకు ఇదే తెలుగులో మొదటి సినిమా. ఆతర్వాత ఇప్పుడు మరోసారి అనుపమ, సమంత కలిసి స్క్రీన్ పై సందడి చేయనున్నారని అంటున్నారు. మరి ఈ వార్తల్లో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది.

## ప్రభాస్ అంటే ఆమాత్రం క్రేజీ ఉంటుంది..?

### 21 సలార్ రీరిలీజ్... అప్పుడో బుక్ అయిపోయిన టికెట్స్

**టాకీస్:** కృష్ణంరాజు నట వారసుడిగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రభాస్ తన క్రేజ్‌ని అమాంతం పెంచుకుంటున్నాడు. మధ్యలో కొన్ని ఫ్లాపులు పలకరించిన తర్వాత వరసగా హిట్స్ అందుకుంటున్నాడు. బాహుబలి సినిమాతో వరల్డ్ వైడ్ గా అభిమానులను సంపాదించుకున్న ప్రభాస్.. సలార్, కల్కి సినిమాలతో సూపర్ సక్సెస్ అందుకొని తన సత్తా ఏంటో నిరూపించాడు. ఇక ప్రభాస్ తన తర్వాతి సినిమాల లైనప్ చూస్తే దుమ్ము రేపడం ఖాయం. ప్రస్తుతం మారుతితో రాజా సాబ్ అనే సినిమా చేస్తున్న ప్రభాస్.. హను రాఘవపూడి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత సందీప్ రెడ్డితో 'స్పిరిట్'.. సలార్ 2, కల్కి 2 చిత్రాలలో నటించనున్నారు. ఇక ప్రభాస్ నటించిన సలార్ చిత్రం ఎంత పెద్ద హిట్టైందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమా భారీ యాక్షన్ డ్రామాగా రూపొంది ప్రభాస్ అభిమానులకి మంచి ఫీస్ట్ అందించింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని మార్చి 21న రీరిలీజ్ చేయబోతున్నారట. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. పది అంటే




పది నిమిషాల్లో థియేటర్లో నాలుగు షో టికెట్స్ సేల్ కావడం అందరిని ఆశ్చర్యపరిచింది. హైదరాబాద్ సిటీలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ థియేటర్లలో సుదర్శన్ హాలులో సలార్ చిత్రం రీరిలీజ్ అవుతుంది. ఈ థియేటర్‌లో సినిమా చూడడం ఒక అనుభూతి మాదిరిగా ఉంటుంది. అందులో ప్రభాస్ సినిమా చూస్తే ఆ థ్రిల్లే వేరు. అందుకే జనాలు సలార్ సినిమా రీరిలీజ్ చూసేందుకు ఎగబడుతున్నారు. ఈ సినిమా కలెక్షన్స్ విషయంలో సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయడం ఖాయం అంటున్నారు. ప్రస్తుతం ప్రభాస్ రెండు పడవల మీద ప్రయాణం చేస్తున్న విషయం తెలిసిందే . ఒక వైపు మారుతి దర్శకత్వం వహిస్తున్న 'ది రాజా సాబ్' చిత్రీకరణలో పాల్గొంటూనే మరొక వైపు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఫౌజీ షూటింగ్ పూర్తి చేస్తున్నాడు. కొన్ని రోజులు ఒక సినిమా ఇంకొన్ని రోజులు వేరే సినిమా చేస్తున్నాడు. ఇవి రెండు పూర్తయ్యాక సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా చేయనున్నట్టు తెలుస్తుంది. అయితే స్పిరిట్ సినిమా చేసే సమయంలో సందీప్ పూర్తిగా ప్రభాస్‌ని లాక్ చేయనున్నాడు. ఇక ఈ మూవీ తర్వాతే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్' సీక్వెల్, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ చేయనున్నాడని అంటున్నారు.

## చాహల్‌తో డేటింగ్ రూమర్స్..

### ఆసక్తికర పోస్ట్ పెట్టిన మహ్‌వశ్

**టాకీస్:** డాన్సర్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ ధనశ్రీ వర్మతో విడాకుల అనంతరం టీమ్ ఇండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మళ్లీ ప్రేమలో పడ్డట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. యూట్యూబర్, రేడియో జాకీ మహ్‌వశ్ తో చాహల్ డేటింగ్‌లో ఉన్నట్లు బీ టౌన్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. రీసెంట్‌గా దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను వీరిద్దరు కలిసి చూడడం.. మ్యాచ్‌కు ముందు ఓ సెల్ఫీ వీడియో, ఫొటోలను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేయడం వలన ఈ వార్తలకు బలం చేకురింది. దీంతో చాహల్ మహ్‌వశ్‌తో ప్రేమలో పడ్డట్లు






టాక్ నడుస్తుంది. ఇదిలావుంటే మహ్‌వశ్ పెట్టిన ఒక పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఇన్‌స్టా వేదికగా మహ్‌వశ్ స్టోరీ పెడుతూ.. రీసెంట్‌గా తనకు బెస్ట్ ఇన్‌ఫ్లూయెన్సర్ అవార్డు రావడంపై స్పందించింది. "నేను ఈ స్థాయికి చేరడం చూస్తే చిన్నప్పటి మహ్‌వశ్ ఎంతో సంతోషిస్తుంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన అనుభూతి. ఎలాంటి తప్పులు చేయకుండా, అసత్యాలను లెక్కచేయకుండా, మనం మన పనిని నిజాయితీగా చేస్తూ ముందుకు వెళ్లాలి." అంటూ రాసుకోచ్చింది. అయితే డేటింగ్ రూమర్స్ వస్తున్న వేళ మీడియాకు కౌంటర్‌గా మహ్‌వశ్ ఈ పోస్ట్ పెట్టినట్లు తెలుస్తుంది.

## రెండేండ్ల నిరీక్షణకు తెర..

### ఓటీటీలోకి వచ్చేసిన అఖిల్ 'ఏజెంట్'



టాకీస్: అక్కినేని అఖిల్ ప్రధాన పాత్రలో నటించిన 'ఏజెంట్' చిత్రం ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. హోలీ పండుగ కానుకగా మార్చి 14న స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించిన సోనిలివ్ ఒకరోజు ముందుగానే ఈ సినిమాను ఓటీటీలో విడుదల చేసింది. ప్రస్తుతం ఈ చిత్రం సోనీ లివ్ వేదికగా తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. అఖిల్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమాకు సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించగా.. సాక్షి వైద్య కథానాయికగా నటించింది. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో నటించారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం 2023 ఏప్రిల్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి డిజాస్టర్ అందుకుంది. ఈ సినిమా ఇచ్చిన ఎఫెక్ట్‌కి సురేందర్ రెడ్డి, అఖిల్ ఇంకో సినిమాకు కూడా సంతకం చేయలేదంటే ఆ సినిమా డిజాస్టర్ ఎంత ఇంపాక్ట్ చూపించిందో అర్థం చేసుకోవచ్చు.

గతంలో ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ప్రకటించినప్పటికీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తూ వచ్చారు. ఇక గత రెండు ఏండ్లుగా ఊరిస్తున్న ఈ చిత్రం ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. ఈ సినిమా చూద్దామనుకున్న మూవీ లవర్స్ ఆలస్యం చేయకుండా చూసేయండి మరి.

## కిల్లర్ హీరోయిన్‌కు కర్ణాటక స్టేట్ అవార్డు

టాకీస్: తెలుగులో వరుస చిత్రాలతో తన సత్తాను చాటుతోంది కన్నడ నాయిక జ్యోతి పూర్వజ్. ఆమె ప్రస్తుతం సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'కిల్లర్' లో నటిస్తోంది. విశేషం ఏమంటే ఆమె నటించిన కన్నడ చిత్రం 'వర్ణపతల' కర్ణాటక స్టేట్ ఫిల్మ్ అవార్డులో రెండవ ఉత్తమ చిత్రంగా నిలచించింది. ఈ అవార్డు రావడం పట్ల జ్యోతి పూర్వజ్ హర్షం వ్యక్తం చేయగా, 'కిల్లర్' టీమ్ ఆమెను అభినందించింది. 'శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్" వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ ను ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ ప్రస్తుతం కిల్లర్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో పూర్వాజ్ హీరోగా నటిస్తుండగా, జ్యోతి పూర్వజ్ హీరోయిన్ గా నటిస్తోంది. విశాల్ రాజ్, గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. థింక్ సినిమా బ్యానర్ పై ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థలతో కలిసి పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి దీనిని నిర్మిస్తున్నారు. 'కిల్లర్' పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది.



### తెలుగువారికి నన్ను దగ్గర చేసిన సినిమా

## యుగానికి ఒక్కడు : కార్తీ

టాకీస్: తమిళ నటుడు కార్తీ నటించిన క్లాసిక్ చిత్రాలలో 'యుగానికి ఒక్కడు' (తమిళంలో 'ఆయిరత్తిల్ ఒరువన్') ఒకటి. సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని డ్రీమ్ వ్యాలీ కార్పొరేషన్ బ్యానర్‌పై ఆర్. రవీంద్రన్ నిర్మించారు. కార్తీ, రీమా సేన్, ఆండ్రియా జెరెమయ్యా ప్రధాన పాత్రల్లో నటించారు. హిస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రం 2010లో విడుదలై తమిళంతో పాటు తెలుగులో సూపర్ హిట్ అందుకుంది. ఇక ఇదే సినిమాతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నటుడు కార్తీ. అయితే ఇదే సినిమాను దాదాపు 15 ఏండ్ల సంవత్సరాల తర్వాత మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. మార్చి 14న ఈ చిత్రం రీ రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా రీ రిలీజ్ ప్రమోషన్స్‌లో పాల్గొన్నాడు కార్తీ. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. నన్ను తెలుగువారికి దగ్గర చేసిన చిత్రం యుగానికి ఒక్కడు. నేను ఎన్నో సినిమాలు చేసిన కూడా



యుగానికి ఒక్కడు చిత్రం నా కెరీర్‌లో టాప్‌లో ఉంటుంది. దాదాపు 3 ఏండ్లు పగలు రాత్రి కష్టపడి చేసిన సినిమా అది. ఇది బాక్సాఫీస్ ట్రెండ్ సెట్టర్. ఈ మూవీ మ్యూజిక్ పరంగా కావచ్చు, సౌండ్ ఎఫెక్ట్స్, విజువల్ ఎఫెక్ట్స్ ఇలా అన్ని విభాగాలలో సత్తా చాటింది. ఈ సినిమాలో వచ్చిన ఎవర్రా మీరంతా అనే డైలాగ్ ప్రస్తుతం ఒక ట్యాగ్‌లైన్‌గా మారిపోయింది.